తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 06.02.2026 | సంపుటి :12 సంచిక : 198 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

గ్రూప్-1 నియామకాలు సక్రమమే

సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన హైకోర్టు ధర్మాసనం

- ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు భారీ ఊరట
- అభ్యర్థులకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై మిగతా 2లో..

తెలంగాణలో ఎస్ఐఆర్



ఏప్రిల్, మే నెలల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సుదర్శన్‌రెడ్డి సమావేశం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఏప్రిల్, మే నెలల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ఎలక్ట్రోల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ కోసం ముందస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఈవో వెల్లడించారు. సన్నాహక చర్యల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సుదర్శన్‌రెడ్డి సమావేశం మిగతా 2లో..

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు నేత ఉదమ్ సింగ్ మృతి

చర్ల(జనంసాక్షి): బీజాపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్లటూన్-30 కమాండర్ ఉదమ్ సింగ్ మృతి చెందినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం నుంచి భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. మిగతా 2లో..

బీఆర్ఎస్, బీజేపీ మిలాఖత్

ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది

గుమ్లాపూర్‌లో మహిళా సంఘాలకు చెక్కులు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, ఎమ్మెల్యేలు అడ్లూరి, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం తదితరులు

ఉచిత కరెంటు దేశానికి ఆదర్శమైంది. ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్. రైతులకు ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది. పాలమూరు జిల్లాలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రచారానికి తీసుకువచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి ప్రధాని సహా దేశం మొత్తం నేతలను తీసుకురండి. బీజేపీ అందరినీ ప్రచారానికి తెచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా?. కాంగ్రెస్ సత్తా ఏంటో చూపిస్తాం. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని మోదీ చెప్పారు. ఏం ఇవ్వడానికి బిల్లీ నేతలను తెచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు గాడిద గుడ్డు తెచ్చారు తప్ప అణాపైసా ఇవ్వలేదు. - సీఎం రేవంత్ రెడ్డి

- అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు
- పదేళ్లలో బీఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బీజేపీ అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- గుమ్లాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు

కరీంనగర్,ఫిబ్రవరి 5(జనంసాక్షి)

ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి మిగతా 2లో..

యూపీఎస్సీ కీలక మార్పులు

ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు తప్పనిసరి

న్యూఢిల్లీ(జనంసాక్షి): అఖిల భారత సర్వీసుల్లో నియామకాలకు సంబంధించి నిర్వహించే పరీక్షలో యూపీఎస్సీ ఈసారి కీలక మార్పులు చేసింది. పరీక్షల్లో మోసాన్ని నివారించేందుకు ఏఐ ఆధారిత ముఖ గుర్తింపును తప్పనిసరి చేసింది. ఇప్పటికే పలు సర్వీసులకు ఎంపికైన వారు మళ్లీ పరీక్ష రాయాలనుకుంటే వారి అర్హతలను కఠినతరం చేసింది. దీనికి సంబంధించి గురువారం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఉచితాలపై విచారణకు ఓకే

- ఎన్నికలకు ముందు 'ఉచిత' హామీలపై పిల్
- విచారణకు అంగీకరించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఎక్కువగా ఉచితాల వైపే దృష్టిసారిస్తాయి. ఈ ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు లో పిల్ దాఖలైంది. తాజాగా దాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అందులో ఎన్నికలకు ముందు అసంబద్ధమైన 'ఉచిత' హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల గుర్తులు, వాటి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని ఆయన కోరారు. తన పిల్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని.. ఇది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఓ చట్టాన్ని రూపొందించేలా మిగతా 2లో..

అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో భారత్

పరపతి పెరిగింది

ఈ ట్రేడ్‌డీల్‌తో మరింత బలం పుంజుకున్న భారత్

- దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు
- దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది
- ప్రపంచ దేశాలు స్వాగతం పలుకుతున్నాయి..
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు రాజ్యసభలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. అమెరికాతో ట్రేడ్ డీల్ తర్వాత భారత్ బలం మరింత పెరిగిందన్నారు. ఈ ఒప్పందం తర్వాత మన యువతకు ఎక్కువ లబ్ధి జరగనుందని, ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయని తెలిపారు. గతంలో ఇండియాతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావన్నారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ మంత్రంతో దూసుకెళుతున్నామన్నారు. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. "దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఈయూ కూటమితో అనేక ఒప్పందాలు చేసుకున్నాం. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అమెరికాతో ట్రేడ్ డీల్ తర్వాత భారత్‌కు మరింత బలం పెరుగుతుంది. మన యువతకు ఎక్కువ లబ్ధి జరగనుంది. కాంగ్రెస్‌పై మిగతా 2లో..

మహాత్మా గాంధీ ఉపాధి పథకం

ఓ నిశ్శబ్ద విప్లవం

దీన్ని తిరిగి తెచ్చే వరకు కోట్లాది కాంగ్రెస్ శ్రేణులు పోరాడుతాయి

- బలమైన బ్రిటిష్ పాలకులు గాంధీని ముట్టుకోలేకపోయారు
- కానీ దేశానికి చెందిన మతతత్వ శక్తులు ఆయన్ని కాల్చి చంపాయి
- చెన్నై బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

చెన్నై(జనంసాక్షి): మహాత్మా గాంధీ ఏం పాపం చేశారని ఉపాధి హామీ పథకం నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలగించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రశ్నించారు. గురువారం సాయంత్రం చెన్నై నగరంలో ఉపాధి హామీ పథకం నిబంధనలు మార్పు, ఉపాధి పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర అనంతరం ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి ఆ పథకం కనిపించకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది, ఈ చట్టంలో మహాత్మా గాంధీని పేరు తొలగించడమే కాదు వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ గ్యారంటీ కల్పించాలన్న ఆత్మను సైతం మిగతా 2లో..

పన్నెండేళ్లుగా తెలంగాణలో

బానిస ప్రభుత్వాలు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన మిగతా 2లో..

కేసీఆర్‌ను తిరిగి సీఎం చేస్తేనే అభివృద్ధి సాధ్యం

- రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దోఖా చేసింది
- సిరిసిల్ల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ మిగతా 2లో..

మేఘాలయ బొగ్గుగనిలో

భారీ పేలుడు

18 మంది కూలీల దుర్మరణం

షిల్లాంగ్(జనంసాక్షి): మేఘాలయలో బొగ్గుగనిలో గురువారం భారీ ప్రమాదం జరిగింది. అందులో పేలుడు సంభవించడంతో 18 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన కథనాల ప్రకారం.. గనిలో బొగ్గు తవ్వకాలు చేపడుతోన్న సమయంలో ఈ పేలుడు జరిగింది. దాంతో కూలీలు అందులో చిక్కుకుపోయారు. వారిలో ఎక్కువమంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. మేఘాలయలో ర్యాట్‌హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలను 2014లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే మిగతా 2లో..

ఇంధన భద్రతకే అధిక ప్రాధాన్యం

అందుకోసం ఏ దేశం నుంచైనా చమురు కొనుగోళ్లు చేస్తాం: భారత విదేశాంగశాఖ

న్యూఢిల్లీ(జనంసాక్షి): రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు నిలిపేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ అంశంపై భారత విదేశాంగశాఖ స్పందించింది. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని, చమురు సేకరణ విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇదే మూలమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా విభిన్న సరఫరాదారులను ఆశ్రయించడం అనేది ప్రభుత్వ వ్యూహంలో భాగమని పేర్కొంది. "వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో వెనెజువెలా చాలా కాలంగా భారత్ భాగస్వామిగా ఉంది. గతంలో ఆ దేశం నుంచి చమురు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాం. ఇంధన భద్రత విషయంలో మా విధానాలకు అనుగుణంగా.. వెనెజువెలా సహా ఏ దేశం నుంచైనా ముడి చమురు మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06.02.2026

గూమ్లాపూర్ సభలో జగిత్యాల అభివృద్ధికి సీఎం హామీ

జగిత్యాల బ్యూరో ఫిబ్రవరి 5 (జనం సాక్షి): కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గూమ్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన?ప్రగతి బాట బహిరంగ సభలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు.సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేశారని తెలిపారు. జగిత్యాల యావర్ రోడ్డు విస్తరణకు వినతి అందిందని, ఆ రోడ్డును తప్పకుండా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వాలంటరీ ల్యాండ్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,కేంద్రీయ విద్యాలయం ,మినీ స్టేడియం ఏర్పాటు ప్రతిపాదనను కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారికి జగిత్యాల ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో భారత్ పరపతి పెరిగింది

ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోందన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు.తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి.

ఎన్నో సంస్కరణలు తెచ్చాం..

బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ధి పొందారు. 2014 తర్వాత ప్లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది.

చొరబాటుదారులను రక్షిస్తున్నారు..

అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

కేసీఆర్‌ను తిరిగి సీఎం చేస్తేనే అభివృద్ధి సాధ్యం

చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీని గనుక ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయకుంటే, ఇచ్చిన హామీల మోసంపైన ప్రశ్నించకుంటే, మరో మూడు సంవత్సరాల దాకా అంటే శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని చెప్పారు. ఇప్పుడు గనుక ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేలా సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్లడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటెయ్యండి, రానివారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరువు లేకుండా చేసినోడికి, గట్టి బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వార్డుల ప్రజలను, పట్టణ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్దాలు చెబతోందని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు వేస్తే మరోసారి మోసపోయినట్లు అవుతుందని చెప్పారు. కేటీఆర్ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'మున్సిపల్ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తానని చెబుతున్నారు. కానీ ఇప్పటికీ ఎన్ని పంట కాలాలు గడిచాయి..? ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో చెప్పాలి. రైతుబంధు రైతన్నల ఖాతాలో వేయడానికి ముఖ్యమంత్రికి మున్సిపల్ ఎన్నికలు ఏ విధంగా అడ్డు వస్తున్నాయి? కేవలం ఎన్నికలు అయిపోయేంత వరకు ఆశ చూపించి, మరొకసారి మోసం చేయడానికే రేవంత్ రెడ్డి ఈ మాట చెబుతున్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను కూడా పక్కన పెట్టారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అందరినీ మోసం చేస్తున్నది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మళ్లీ కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటువేస్తే.. మళ్లీ మోసపోవడం ఖాయం' అని కేటీఆర్ అన్నారు. 'ముఖ్యమంత్రికి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏమున్నది? చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కానీ కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏముంది..? ప్రతి అంశంలో అడ్డగోలుగా మాట్లాడటం, అబద్దాలు ఆడటం తప్పించి, ఈ రెండేళ్ళలో ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు. కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. ఈ ఎన్నికల్లో జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాటలు చూసి ఓటు వేయాలి. జిల్లాలు ఎత్తివేస్తామని చెప్పిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే అది మంచా, చెడా అన్న విషయాన్ని గుర్తించి ఓటు వేయాలని కేటీఆర్ సూచించారు.

బీఆర్ఎస్,బీజేపీ మిలాఖత్

కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి.పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల తోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్దాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల పొన్నం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఎస్ఐఆర్..

నిర్వహించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ కోసం రాజకీయ పార్టీల బీఎల్ఏలు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో కచ్చితత్వం, పారదర్శకత, సమస్యల సకాల పరిష్కారం కోసం స్థానికులనే బీఎల్ఏగా నియమించాలని సూచించారు. ప్రస్తుతం 2025 జాబితాలోని ఓటర్లను 2002 ఎస్ఐఆర్‌లో నమోదైన ఓటర్లతో అనుసంధానించేలా టేబుల్ టాప్ మ్యాపింగ్‌తో పాటు.. క్షేత్రస్థాయి మ్యాపింగ్ కొనసాగుతోందన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసాలను గుర్తించి ధ్రువీకరించేందుకు బీఎల్ఓలు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నట్లు సీఈవో వివరించారు. ఎస్ఐఆర్ సమయంలో ప్రతీ పోలింగ్ ప్రాంతాన్ని బీఎల్ఓలు మూడు, నాలుగు సార్లు సందర్శిస్తారని తెలిపారు. మొదట వెళ్లినప్పుడు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారు. అందుబాటులో లేని కుటుంబాలను ధ్రువీకరించేందుకు మరోసారి వెళ్తారన్నారు. సన్నాహక దశలో మ్యాపింగ్ కాకపోయిన ఓటర్లు కూడా ఎస్ఐఆర్ సమయంలో తమ వివరాలు సమర్పించుకునే అవకాశం ఉంటుందని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ స్థాయిలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యమైతే ఫిర్యాదులను తగ్గించి.. అర్హులైన ఓటర్లు జాబితా నుంచి మిస్ కాకుండా ఉంటారని పేర్కొన్నారు.

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్..

డీఆర్‌జీ (డిస్టిక్ రిజర్వ్ గార్డు) సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. పెద్దగెల్లూరు అడవిలో మావోయిస్టులు ఉన్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బలగాలు ఆ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాలకు మధ్య కాల్పులు జరిగాయి. అయితే ఘటనాస్థలి నుంచి ఆటోమేటిక్ ఏకే-47 రైఫిల్‌తో పాటు పలు ఆయుధసామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

గ్రూప్-1 నియామకాలు సక్రమమే..

విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

అభ్యర్థులకు సిఎం అభినందన

గ్రూప్ -1 నియామకాల అంశంలో హైకోర్టు తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయ పూర్వకంగా స్వాగతిస్తున్నామన్నారు. ఎందరు, ఎన్ని కుట్రలు పన్ని.. ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా.. వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని తెలిపారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో 563 మంది గ్రూప్ -1 అభ్యర్థులకు అభినందనలు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి గ్రూప్ -1 అధికారులుగా మీరు నియమితులయ్యారు. ఇక రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిస్తున్నానని పేర్కొన్నారు. కాగా.. గ్రూప్ -1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఊరట లభించింది. గ్రూప్-1

నియామకాలపై హైకోర్టు బెంచ్ కీలక తీర్పు వెల్లడించింది. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది సీజే ధర్మాసనం. గ్రూప్ 1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. మెయిన్స్ జవాబు పత్రాలు మళ్ళీ మూల్యాంకనం చేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. అయితే సింగిల్ జడ్జి ఆదేశాలపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈమేరకు తీర్పు వెలువరించింది. తుది తీర్పునకు లోబడి నియామకాలు చేపట్టవచ్చని గతంలో ఉత్తర్వులు ఇచ్చింది సీజే బెంచ్.. ఇప్పటికే 562 మందికి తెలంగాణ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ఈ తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

'ఉచితాలపై విచారణకు ఒకే..

కేంద్రాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. ధర్మాసనం దీన్ని తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ.. దీనిపై మార్చి చివరిలో విచారణ జరిపేందుకు అంగీకరించింది.

మేఘాలయ బొగ్గుగనిలో భారీ పేలుడు

పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. కాగా.. ఎన్‌జీటీ నిషేధాన్ని నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

పన్నెండేళ్లుగా తెలంగాణాలో బానిస ప్రభుత్వాలు

చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ,
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

యాదాద్రిభువనగిరి జిల్లా , యాదాద్రిభువనగిరి,యాదాద్రిభువనగిరి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆర్ & బి) డివిజన్‌లో రూ. 4.70లక్షల విలువ గల ఒక పనికి ఈ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ కింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నాయి. NIT NO.DB/BNG/11/2025-26/1 to 2 datedG 04.02.2026. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఈ-మార్కెట్‌ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in** నుండి తేది: 05.02.2026 సాయంత్రం: 3.30 గం॥ల నుండి. టెండర్ల స్వీకరించడానికి చివరి తేది: 12.02.26 సాయంత్రం 3.30గం॥లకు.మిగతా వివరాలకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా **.tender.telangana.gov.in**

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఆర్&బి) డివిజన్: యాదాద్రి భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా

DIPR No.14999-PP/CL/ADVT/1/2025-26

మహాత్మా గాంధీ ఉపాధి పథకం ఓ నిశ్శబ్ద విప్లవం

తొలగించారని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులు ఏం పాపం చేశారని ఉపాధి హామీ పథకంలో కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మార్పులు చేసిందని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రతి వ్యవసాయ సీజన్లో 50 పైసల కూలీ ధరల పెరుగుదల కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ఆందోళనలు, పోలీసు లాఠీచార్జీలు, రక్తపాతం జరిగేవి అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ దారుణమైన పరిస్థితులను పారద్రోలాలన్న మానవీయకోణంతో యూపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో దేశంలోని కోట్లాదిమంది వ్యవసాయ కార్మికుల కోసం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఈ దేశంలో తీసుకువచ్చారని తెలిపారు. చిన్న రక్తపాతం, ఎలాంటి ఆందోళనలు లేకుండా కూలీలకు 100 రోజుల పని గ్యారంటీ కల్పిస్తూ, ఉపాధి అనేది వ్యవసాయ కార్మికుల హక్కు అని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం దేశంలోని కోట్లాది వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఒక నిశ్శబ్ద విప్లవం అని వర్ణించారు. ఈ గొప్ప పథకం వ్యవసాయ కార్మికుల జీవితాలకు ఓ అర్థం తీసుకువచ్చింది, ఉన్న ఊరిలోనే సంపాదిస్తూ ఆత్మగౌరవంతో వ్యవసాయ కూలీలు జీవించేందుకు మహాత్మా గాంధీ ఉపాధి పథకం తోడ్పడిందని తెలిపారు. ఇంతటి గొప్ప పథకాన్ని కనుమరుగు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చింది, చివరకు దేశ ప్రజలు మహాత్మునిగా పిలుచుకునే గాంధీ పేరును సైతం తొలగించిందని తెలిపారు. ఏ సి సి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ల పిలుపుమేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల పిసిసి కమిటీల ఆధ్వర్యంలో దేశంలోని కోట్లాది వ్యవసాయ కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం 2005 ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించే వరకు వ్యవసాయ కార్మికుల పక్షాన దేశంలోని కోట్లాది కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు వ్యవసాయ కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. సామాన్యునికి ఇబ్బందులు వచ్చినప్పుడు తమిళనాడు ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడుతుంది ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం తెచ్చిన కొత్త ఉపాధి చట్టంతో వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి ఇప్పుడు కూడా తమిళనాడు ముందు వరుసలో నిలబడి వ్యవసాయ కార్మికుల పక్షాన నిలబడటం అభినందనీయం అన్నారు. ఈరోజు చెన్నై నగరంలో జరుగుతున్న భారీ ర్యాలీని చూస్తే తనకు కొన్ని విషయాలు గుర్తుకు వస్తున్నాయని వివరించారు. ఈ దేశ స్వతంత్రం కోసం మహాత్మా గాంధీ 1915లో ఆయన తన న్యాయవాద వృత్తిని వదిలి దేశానికి వచ్చారని గుర్తు చేశారు. అధికారం కోసమో? ఇతర వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆయన ఈ దేశానికి రాలేదని తెలిపారు. తన సహచరులతో కలిసి దేశ స్వాతంత్రం కోసం గొప్ప పోరాటం నిర్వహించాలని పట్టుదలతో న్యాయవాద వృత్తిని వదిలేసి దక్షిణ ఆఫ్రికా నుంచి వచ్చారని తెలిపారు. దారుణమైన బ్రిటిష్ పాలన నుంచి దేశ ప్రజలను విముక్తి కల్పించడానికి మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ, దండి మార్చ్, ఉప్పు సత్యాగ్రహం, సంపూర్ణ స్వరాజ్యం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో ఆయనతోపాటు అనేకమంది సీనియర్ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. వారి అద్భుతమైన, సాహసోపేతమైన పోరాటం మూలంగా మన దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం సిద్ధించడమే కాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద

సమ్మక్క-సారక్క జాతర హుండీల లెక్కింపు ప్రారంభం

- రూ.2.49 కోట్ల ఆదాయం

మేడారం/హనుమకొండ, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : సమ్మక్క-సారక్క జాతర-2026 సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హూండీల లెక్కింపు ప్రక్రియను గురువారం హనుమకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో ప్రారంభించారు. దేవాదాయ శాఖ అధికారులు, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో ఈ లెక్కింపు కొనసాగుతోంది. జాతరకు సంబంధించి మొత్తం 828 హూండీలు ఏర్పాటు చేయగా, ఇందులో 780 ఇనుప హూండీలు, 45 వస్త్ర హూండీలు, 3 బియ్యం హూండీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మొదటి రోజు భాగంగా 125 హూండీలను తెరిచి లెక్కించగా, వాటి ద్వారా రూ.2,49,65,000/- ఆదాయం లభించినట్లు వెల్లడించారు. లెక్కించిన నగదును పర్యవేక్షణాధికారుల సమక్షంలో బ్యాంకు అధికారులకు అప్పగించారు. బంగారం, వెండి కానుకలను వేర్వేరుగా ఇనుప హూండీలలో భద్రపరచి తాళాలు వేసి ఉంచినట్లు తెలిపారు. నాణేల లెక్కింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. హూండీల లెక్కింపు ప్రశాంతంగా సాగుతోందని, మిగిలిన హూండీల లెక్కింపును దశలవారీగా పూర్తి చేస్తామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

తన నియామకం పట్ల ఉప్పల కృతజ్ఞతలు

హైదరాబాద్ (జనంసాక్షి) : ధర్మపురి మున్సిపాలిటీ కో ఆర్డినేటర్‌గా తనను నియమించిన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జీకి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంతో ధర్మపురి మున్సిపాలిటీకి కో ఆర్డినేటర్ గా బాధ్యతలు అప్పగించడం తనపై పార్టీ ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వం చూపిన మార్గదర్శకత్వంతో ధర్మపురి మున్సిపాలిటీలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, కార్యకర్తలను సమన్వయం చేస్తూ విజయం సాధించే దిశగా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ విజయమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తానని ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు.

నేడు ఇబ్రహీంపట్నంకు మాజీ సిఎం జగన్

- వెస్ట్ బైపాస్ మీదుగా వెళ్లాలని పోలీసుల సూచన
- విజయవాడ నగరం మీదుగా వెళ్లడం కుదరదని వెల్లడి
- జగన్‌కు నగర పోలీస్ కమిషనర్ నోటీసులు జారీ

విజయవాడ, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం పర్యటనపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది. ఉదయం వేళలో.. విజయవాడ నగరంలో భారీ ట్రాఫిక్ ఉంటుంది. ఈ నేపథ్యంలో దుర్గమ్మ వారిధి మీద నుంచి కాకుండా.. వెస్ట్ బైపాస్ మీదగా ఇబ్రహీంపట్నం వెళ్లాలని వైఎస్ జగన్‌కు ఆ కమిషనర్ కార్యాలయం ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పార్టీ శ్రేణులు ఇబ్రహీంపట్నం చేరుకుని.. ఆందోళనకు దిగాయి. అనంతరం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసంపై దాడికి యత్నించాయి. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి వైసీపీ నేత అంబటి రాంబాబు తీవ్ర పదజాలంతో దూషించారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా అంబటి రాంబాబుపై పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో బుధవారం గుంటూరులోని అంబటి రాంబాబు కుటుంబాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా భారీ కాన్వాయ్‌తో వైఎస్ జగన్ తాడేపల్లి నుంచి అంబటి రాంబాబు నివాసానికి చేరుకున్నారు. దాంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం వెళ్లే క్రమంలో వైఎస్ జగన్ భారీ కాన్వాయ్‌తో వెళ్లితే.. విజయవాడ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందని నగర పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా వైఎస్ జగన్‌కు కమిషనర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి వైఎస్ జగన్ ఇబ్రహీంపట్నం బయలుదేరతారు. కనక దుర్గమ్మ వారధి, ఆర్టీసీ బస్టాండ్, భవానీపురం, గొల్లపూడి, గుంటుపల్లి, తుమ్మలపాలెం మీదుగా ఇబ్రహీంఎ ట్నంలోని జోగి రమేశ్ నివాసానికి చేరుకుని.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం వైఎస్ జగన్ మధ్యాహ్నం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. ఈ మేరకు వైసీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

మేడారంలో అత్యాచారం ఘటన అబద్ధం

- తేల్చి చెప్పిన జాతీయ మహిళా కమిషన్

ములుగు, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. మామిడితోటలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు యువకులు వాష్ రూమ్‌కు వెళ్లిన బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అనంతరం ఈ ఘటనకు కారణమైన యువకులు జంపన్నవాగు సమీపంలోని ఒక షాపులో దాక్కున్నారని.. వారిని పోలీసులు తీసుకువెళ్లినట్లు ఆ వార్త కథనంలో పేర్కొన్నారు. ఈ వార్తను ఇప్పటికే ములుగు ఎస్పీ రామ్‌నాథ్ సుధీర్ కేకర్ ఖండించారు. అలాంటి ఘటన ఏదీ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్‌లోని సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ములుగు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి.. కమిషన్‌కు నివేదిక అందజేయనుంది.

టీజీఎస్ఆర్టీసీ తార్నాక ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ ఎంట్రీలెవల్ గుర్తింపు

- వైద్య సేవా ప్రమాణాల మెరుగుదలకు మరింత కృషి
- తార్నాక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి

తార్నాక (జనంసాక్షి) : తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెఎచ్) నుండి గుర్తింపు పొందింది. నాణ్యమైన వైద్య సేవలు, రోగి ఆరోగ్య భద్రతను నిర్ధారించే దిశగా ఆసుపత్రి చేస్తున్న నిరంతర కృషికి ఇదొక మైలురాయిగా నిలువనుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆసుపత్రిలో మెరుగైన మౌలిక సదుపాయాల, వైద్య సేవల బలోపేతం, సేవా ప్రమాణాల మెరుగుదల కోసం కృషి చేస్తోంది. అధునాతన అత్యవసర, క్రిటికల్ కేర్ సేవలు, మాడ్యులర్ సూపర్ స్పెషాలిటీ ఆపరేషన్ థియేటర్లు, పూర్తిస్థాయి క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు, వివిధ రకాల చికిత్స సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సదుపాయాలు రోగులకు సమయానుకూలంగా, సురక్షితంగా, ప్రత్యేక వైద్య సేవలను అందించడానికి సహాయపడుతున్నాయి. ఆసుపత్రి విద్యా, శిక్షణ కార్యక్రమాలను కూడా విస్తరించింది. 100 సీట్ల బీఎస్సీ నర్సింగ్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, శస్త్రచికిత్స, ఆర్థోపెడిక్స్ మరియు జనరల్ మెడిసిన్లో డీఎన్బీ పీజీ కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ఇవి నైపుణ్యంతో కూడిన ఆరోగ్య సేవా సిబ్బందిని తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ధృవీకరణ నాణ్యమైన ఆరోగ్య సేవలు, రోగి భద్రత, నైతిక వైద్య పద్ధతులు, మెడికో-లీగల్ అనుసరణ పట్ల ఆసుపత్రి యొక్క కట్టుబాటును ప్రతిబింబిస్తుంది. టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులు, వారి అర్హులైన ఆధారితులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన సురక్షిత వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి నిరంతరం కృషి చేస్తోంది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మరియు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పి. శ్రీనివాస్ , ఇతర వైద్య బృందాన్ని వైస్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వై. నాగి రెడ్డి గారు అభినందించారు. వైద్యుల సమష్టి కృషి, పట్టుదల, అత్యుత్తమైన ఆరోగ్య సేవల్ని సాధించాలనే అచంచలమైన సంకల్పానికి ఇది నిదర్శనం అని కొనియాడారు. టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు, అర్హులైన వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన వైద్య సేవల్ని కొనసాగించాలని సూచించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన చీూదీఎ సర్టిఫికేషన్ పొందడం చాలా సంతోషంగా ఉందని, ఇది అందరి కృషితోనే సాధ్యమైందని తార్నాక ఆసుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్ శ్రీమతి శైలజామూర్తి పేర్కొ న్నారు. మెరుగైన వైద్య సేవలు, నాణ్యత ప్రమాణాలకు ఇది ఒక గుర్తింపుగా నిలుస్తుందని అన్నారు. ఎంట్రీ లెవల్ సర్టిఫికే ఇషన్ విశ్వసనీయతను పెంచుతుందని, అంతర్గత ప్రక్రియలను బలోపేతం చేయగల దంటూ ఆసుపత్రి పరిశు భ్రతను కాపాడుకో వడంలో సిబ్బంది సహకారాన్ని గుర్తు చేసుకుం టూ, భవిష్యత్తులోనూ ఇదే రకమైన సహకారం అందిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల

- మంత్రి సీతక్క చొరవతో 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్రం ఉత్తర్వులు
- తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల
- మిగిలిన నిధులను వెంటనే విడుదల చేయాలని సీతక్క విజ్ఞప్తి

హైదరాబాద్ (జనంసాక్షి) : గ్రామాల అభివృద్ధికి కీలకమైన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేసింది. ఇది రాష్ట్ర గ్రామ పంచాయతీలకు ఊరటనిచ్చే పరిణామంగా చెప్పుకోవచ్చు. ఎన్నికల జాప్యంతో రెండేళ్లుగా నిధులు నిలిచిపోయాయి. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రావాల్సి ఉన్నప్పటికీ, పలు కారణాల వల్ల గత రెండేళు ్లగా నిలిచిపోయాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం, దానిపై వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు కారణంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడం ఈ జాప్యానికి ప్రధాన కారణంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం లిగ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాతే పెండింగ్ నిధులు విడుదల చేస్తాం అని స్పష్టంగా ప్రకటించింది. ఎన్నికలు లేని పరిస్థితిలో నిధుల విడుదల సాధ్యం కాదన్న కేంద్ర వైఖరి కారణంగా గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే కేంద్ర పెద్దలతో రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పలు దఫాల విజ్ఞప్తులు చేశారు. గ్రామ పంచాయతీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంత్రి సీతక్క ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు ఇతర కేంద్ర పెద్దలను పలు దఫాలు ప్రత్యేకంగా కలిసి రాష్ట్ర పరిస్థితిని వివరించారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురు కావడం , ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ, ఎన్నికలు పూర్తికాకపోవడం కారణంగా నిధుల విడుదల సాధ్యపడలేదు. ఎన్నికల అనంతరం నిధుల విడుదలకు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపారు. మార్చి 31 లోపు నిధులు విడుదల కాకపోతే నిధులు శాశ్వతంగా రద్దు అయ్యే ప్రమాదం ఉండటంతో ప్రక్రియను వేగవంతం చేశారు. సంబంధిత శాఖ అధికారులతో పలుసార్లు సమీక్షలు నిర్వహించి నిధులు తీసుకువచ్చే దిశలో దిశా నిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తికావడంతో పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలంటూ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. కేంద్ర శాఖలతో నిరంతర సంప్రదింపులు జరిపారు. అదే సమయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, ఇతర అధికారులు కూడా నిరంతరంగా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు చెసి నిధుల విడుదలకు కృషి చేశారు. ఈ ప్రయత్నాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రక్రియను ప్రారంభించింది.

రూ.3000 కోట్ల వరకు పెండింగ్ నిధులు

15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ.3000 కోట్ల వరకు రావాల్సి ఉంది. అందులో తొలి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేయడం పట్ల గ్రామ పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. మిగిలిన నిధులు కూడా దశలవారీగా విడుదల చేయాల్సి ఉంది.

తొలి విడత నిధుల విడుదలపై మంత్రి సీతక్క హర్షం

గ్రామ పంచాయతీలకు ఎంతో కీలకమైన నిధులు విడుదల కావడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. అదే సమయంలో మిగిలిన పెండింగ్ నిధులను కూడా ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క గట్టిగా విజ్ఞప్తి చేశారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే గ్రామ పంచాయతీలకు సమయానికి నిధులు అందడం అత్యంత అవసరమని ఆమె స్పష్టం చేశారు.

48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ఫిబ్రవరి 5, (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు 48 గంటల నిబంధన ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగిసే 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మీడియా, ప్రసార సాధనాల ద్వారా ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలను కొనసాగించకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019 చట్టంలోని సెక్షన్ 209 ప్రకారం శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, మీడియా యాజమాన్యాలు 48 గంటల నిబంధనను ఖచ్చితంగా పాటించాలని, స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద
- నరేంద్ర నగర్ పాఠశాల ఆకస్మిక సందర్శన

వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 05 (జనం సాక్షి) : వరంగల్ నరేంద్రనగర్‌లోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, అలాగే సాయంత్రం విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్‌ను కలెక్టర్ పరిశీలించారు.

పాఠశాల సందర్శన సందర్భంగా జిల్లా కలెక్టర్ పదో తరగతి విద్యార్థుల హిందీ, ఇంగ్లీషు, గణితం తదితర సబ్జెక్టుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని, లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం శ్రమించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా సబ్జెక్టు లలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాయంత్రం అందిస్తున్న స్నాక్స్ నాణ్యత, పంపిణీ విధానాన్ని పరిశీలించి, పోషకాహార ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న కూరగాయల రకాలు, సాగు విధానం, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు వ్యవసాయంపై అవగాహన కల్పించే విధంగా కిచెన్ గార్డెన్‌ను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

పాఠశాల అవసరాలకు అనుగుణంగా ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయాలని, సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు పండించాలని కలెక్టర్ తెలిపారు. కిచెన్ గార్డెన్ నిర్వహణలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ద్వారా వారిలో శ్రమ విలువ, ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. టాయిలెట్లను పరిశుభ్రంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సానిటరీ కార్మికులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి పార్థివదేహానికి మంత్రి శ్రీధర్‌బాబు నివాళి

మహదేవపూర్, ఫిబ్రవరి5 (జనంసాక్షి) : మంథని పట్టణంలోని రాంరెడ్డి కాంప్లెక్స్ తీసుకువచ్చినటువంటి మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి పార్థివ దేహాన్నికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులయిన సునీల్ రెడ్డి, అనిల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల మంత్రివర్యులు శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ రాంరెడ్డి గ్రామ సర్పంచిగా ఎంపీపీగా శాసనసభ్యునిగా ఆయన మంథని నియోజకవర్గానికి ఎనలేని సేవ చేశారనీ. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
6 ఫిబ్రవరి 2026

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

అదానీ వారెంట్, 'నరవణే' పుస్తకం వివాదాలే అసలు కారణమా?

2026 సంవత్సరం ఆరంభంలోనే మోదీ ప్రభుత్వం భారత్–అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందాన్ని ఒక "చారిత్రక విజయంగా" ప్రచారం చేసింది. అధికార మీడియా దాన్ని ఆర్థిక దౌత్యంలో మైలురాయిగా చిత్రించింది. కానీ రాజకీయాల చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఉంది. అధికారిక ప్రకటనల వెనుక నిజమైన కారణాలు ఎప్పుడూ దాచబడతాయి. ఈ ఒప్పందాన్ని లోతుగా పరిశీలిస్తే, ఇది ఆర్థిక వ్యూహం కన్నా రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిన దౌత్య నిర్ణయంలా కనిపిస్తోంది. ముఖ్యంగా అదానీపై అమెరికా న్యాయస్థానం జారీ చేసిన వారెంట్, మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే పుస్తకం రేపిన వివాదాలు... ఇవి ఈ ఒప్పందాన్ని వేగవంతం చేసిన మౌన శక్తులుగా అనిపిస్తున్నాయి.

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి "బలమైన నాయకత్వం", "స్వతంత్ర విదేశాంగ విధానం" అనే నినాదాలను పదే పదే వినిపిస్తోంది. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటంటే ...ఈ ప్రభుత్వం అంతర్జాతీయంగా ఎదురయ్యే ప్రతి సంక్షోభంలోనూ పారదర్శకతకన్నా ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. గల్వాన్ సంఘటన తర్వాత చైనాతో జరిగిన సరిహద్దు ఉద్రిక్తతల విషయంలోనూ ఇదే ధోరణి కనిపించింది. "భారత భూభాగం ఎవరూ ఆక్రమించలేదు" అనే అధికారిక ప్రకటనలు ఒక వైపు, మరోవైపు సైనిక స్థాయిలో జరిగిన పరిణామాలు ...ఈ రెండింటి మధ్య ఉన్న విరుద్ధతను మాజీ ఆర్మీ చీఫ్ నరవణే తన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలో స్పష్టంగా బయటపెట్టారు.

ఈ పుస్తకం వెలువడిన వెంటనే ప్రభుత్వం అసహనానికి లోనైంది. సైనికాధికారులే వాస్తవాలను బయటపెడితే, "జాతీయ భద్రత" అనే ముసుగులో దాచిపెట్టిన అబద్ధాలు బహిర్గతమవుతాయన్న భయం సహజమే. 'కార్వాన్' పత్రికలో వచ్చిన ఈ అంశంపై కథనాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చదవడానికి ప్రయత్నించిన సందర్భంలో జరిగిన రాజకీయ రభస, ఈ ప్రభుత్వం నిజాలను ఎదుర్కొనే ధైర్యం కోల్పోయిందన్న భావనను మరింత బలపరిచింది. ఒక ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం నేరం కాదు. కానీ బీజేపీ పాలనలో ప్రశ్నే ఒక ప్రమాదంగా మారింది.

ఇలాంటి పరిస్థితుల్లోనే అంతర్జాతీయంగా మరో పెద్ద సంక్షోభం తెరపైకి వచ్చింది. అదానీ గ్రూప్‌పై అమెరికా న్యాయవ్యవస్థ జారీ చేసిన వారెంట్. ఇది కేవలం ఒక కార్పొరేట్ కేసుగా మాత్రమే చూడలేని అంశం. ఎందుకంటే, అదానీ గ్రూప్ మోదీ ప్రభుత్వానికి రాజకీయంగా, ఆర్థికంగా అత్యంత సన్నిహితమైన కార్పొరేట్ శక్తి. విమానాశ్రయాల నుంచి పోర్టుల వరకు, విద్యుత్ నుంచి రక్షణ రంగం వరకు... దేశ కీలక మౌలిక సదుపాయాల్లో అదానీ పాత్ర ఉంది. అలాంటి సంస్థపై అమెరికాలో న్యాయపరమైన చర్యలు మొదలవడం, అంతర్జాతీయంగా భారత్ ప్రభుత్వ ప్రతిష్ఠపై కూడా ప్రభావం చూపుతుంది.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఈ నేపథ్యంలోనే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం అంత వేగంగా కుదిరిందా? అమెరికా న్యాయవ్యవస్థలో నడుస్తున్న కేసుల నుంచి రాజకీయ ఒత్తిళ్లను తగ్గించుకోవడానికి, వాణిజ్య ఒప్పందాన్ని ఒక "సాఫ్ట్ డిప్లొమసీ" ఆయుధంగా ఉపయోగించారా? అన్న సందేహం అప్రాసంగికం కాదు. ఎందుకంటే, అమెరికా–భారత్ సంబంధాలు ఎప్పుడూ కేవలం ఆర్థిక ప్రయోజనాలపైనే ఆధారపడలేదు. అవి వ్యూహాత్మక అవసరాలు, గ్లోబల్ పవర్ గేమ్స్‌తో ముడిపడి ఉంటాయి.

ఇటీవల వెలుగులోకి వచ్చిన "ఎఫ్ స్టీన్ ఫైల్స్" వంటి అంతర్జాతీయ వివాదాలు కూడా అమెరికా రాజకీయ వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టాయి. "ఎఫ్‌స్టీన్ ఫైల్స్" (జెఫ్రీ ఎఫ్‌స్టీన్‌కు సంబంధించిన న్యాయ పత్రాలు, డాక్యుమెంట్లు) ప్రధానంగా రెండు తీవ్రమైన నేరాల చుట్టూ తిరుగుతాయి. మొదటిది చిన్న వయసు లో ఉన్న బాలికలను లైంగికంగా దోపిడీ చేయడం, వారిని ధనవంతులు, రాజకీయ నాయకులకు పరిచయం చేసి అక్రమ లైంగిక నెట్‌వర్క్ ను నడపడం. రెండోది, ఈ నేరాలను దాచిపెట్టేందుకు ప్రభావవంతమైన వ్యక్తులతో సంబంధాలు పెట్టుకుని న్యాయ వ్యవస్థను మోసగించడం, సాక్షులను బెదిరించడం.

ఈ ఫైల్స్‌లో అమెరికా, యూరప్‌కు చెందిన పలువురు ప్రముఖుల పేర్లు ప్రస్తావనకు వచ్చినప్పటికీ, భారతీయ రాజకీయ లేదా వ్యాపార ప్రముఖులపై ఇప్పటివరకు స్పష్టమైన, అధికారిక ఆధారాలు లేవు. కొన్ని సోషల్ మీడియా ఊహాగానాలు తప్ప, భారతీయుల ప్రత్యక్ష పాత్ర నిర్ధారణ కాలేదు.

ఇటీవల "ద వైర్" ప్రచురించిన కథనాల ప్రకారం, జెఫ్రీ ఎఫ్‌స్టీన్‌కు సంబంధించిన పత్రాల్లో అంబానీ పేరుతో ఉన్న కొన్ని మెసేజ్‌లు ప్రస్తావనకు వచ్చాయని పేర్కొన్నారు. అయితే ఇవి ఆరోపణల స్థాయిలోనే ఉన్నాయే తప్ప, నేరానికి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిర్ధారించబడలేదని కూడా అదే కథనం స్పష్టం చేసింది. ఆ మెసేజ్‌లలో ఎఫ్‌స్టీన్‌తో పరిచయం లేదా సంప్రదింపుల సంకేతాలు ఉన్నాయని మాత్రమే చెప్పబడింది. లైంగిక నేరాలు, అక్రమ కార్యకలాపాల్లో అంబానీ పాత్ర ఉందని నిరూపించే ఆధారాలు లేవు. ఈ అంశంపై అధికారిక దర్యాప్తు లేదా కోర్టు నిర్ధారణ ఇప్పటివరకు జరగలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శక్తివంతుల పేర్లు ఈ కేసుల్లో ప్రస్తావనకు రావడం వల్ల, అమెరికా తన మిత్రదేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎదురైంది. ఈ క్రమంలో చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను నిలబెట్టడం అమెరికా వ్యూహాత్మక లక్ష్యం. కానీ ఈ లక్ష్యాన్ని సాధించేందుకు భారత్ ఎంతవరకు తన స్వతంత్రతను త్యాగం చేసింది అన్నదే అసలు ప్రశ్న. మోదీ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని "దేశానికి లాభం"గా ప్రచారం చేస్తున్నప్పటికీ, దాని నిబంధనలు, దీర్ఘకాల ప్రభావాలపై పార్లమెంట్‌లో గానీ, ప్రజల మధ్య గానీ విస్తృత చర్చ జరగలేదు. ఇది బీజేపీ పాలనకు అలవాటైన పద్ధతే. పెద్ద నిర్ణయాలు .."నోట్ల రద్దు నుంచి వ్యవసాయ చట్టాల" వరకు ముందుగా తీసుకుని, తరువాత ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించడం. వాణిజ్య ఒప్పందాల విషయంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతోంది. ఈ ఒప్పందం నిజంగా భారత చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, భారతీయ వ్యవసాయ తదితర ఉత్పత్తులకు మేలు చేస్తుందా? లేదా బహుళజాతి సంస్థలు, దేశీయ కార్పొరేట్ దిగ్గజాలకు మాత్రమే లాభాలు చేకూరుస్తుందా? అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానాలు లేవు. కానీ గత అనుభవాలు చూస్తే, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలను జాతీయ ప్రయోజనాలుగా చిత్రీకరించడంలో దిట్ట అన్న విషయం తెలిసిందే.చివరికి ఈ మొత్తం వ్యవహారం ఒక స్పష్టమైన చిత్రాన్ని చూపుతోంది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం అనేది కేవలం ఆర్థిక అభివృద్ధి కథ కాదు. ఇది అదానీపై ఉన్న న్యాయపరమైన ఒత్తిళ్లు, నరవణే పుస్తకం ద్వారా బయటపడుతున్న అసౌకర్యకరమైన నిజాలు, అంతర్జాతీయంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు – ఇవన్నిటి మధ్య తీసుకున్న ఒక రాజకీయ రాజీ నిర్ణయం. దీన్ని "విజయం"గా ప్రకటించడం కంటే, మరింత పారదర్శకంగా, బాధ్యతతో ప్రజల ముందు పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.లేనిపక్షంలో, ఈ ఒప్పందం కూడా మోదీ ప్రభుత్వ పాలనలోని అనేక నిర్ణయాల్లాగే ... ఘనమైన ప్రచారంతో మొదలై, కాలక్రమంలో తీవ్రమైన ప్రశ్నల మధ్య నిలిచిపోయే మరో ఉదాహరణగా చరిత్రలో మిగిలిపోతుంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

మన రోజువారీ జీవితంలో కోర్టు తీర్పుల ప్రభావం

సుప్రీం కోర్టు తీర్పులు: సమాజాన్ని నిశ్శబ్దంగా ఆకట్టుకునే అదృశ్య శక్తి

మన రోజువారీ జీవితంలో కోర్టు తీర్పులు ఎంతవరకు ప్రభావం చూపుతాయి? ఈ ప్రశ్న చాలామందికి సాధారణంగా అనిపించవచ్చు. టీవీ చానెళ్లలో హెడ్‌లైన్స్‌గా వచ్చే వార్తలు, సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యే చర్చలు మాత్రమే సుప్రీం కోర్టు తీర్పులంటే చాలామందికి అర్థం. కానీ నిజానికి ఆ తీర్పులు మన ఆలోచనా విధానాన్ని, సామాజిక సంప్రదాయాలను, జీవన శైలిని, రాజకీయ నిర్ణయాలను కూడా నెమ్మదిగా, నిశ్శబ్దంగా మార్చేస్తాయి. మనం గమనించకుండానే సమాజంలో ఒక కొత్త చైతన్యం, కొత్త ఆలోచనా ధోరణి పుట్టుకొస్తుంది. ఇది కేవలం చట్టపరమైన మార్పు కాదు; ఇది సామాజిక, సాంస్కృతిక, నైతిక మార్పులకు బీజం వేసే ప్రక్రియ. భారత రాజ్యాంగం సుప్రీం కోర్టును దేశంలోని అత్యున్నత న్యాయస్థానంగా నిర్దేశించింది. ఇది కేవలం వ్యాజ్యాలు తీర్చే స్థానం మాత్రమే కాదు; రాజ్యాంగ రక్షకుడు, ప్రజల మౌలిక హక్కుల గార్డియన్. గత డెబ్బై ఏళ్లలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు భారతీయ సమాజాన్ని లోతుగా ఆకట్టుకున్నాయి. ఉదాహరణకు, వ్యక్తిగత స్వేచ్ఛల విషయంలో 2017లో గోప్యత హక్కును మౌలిక హక్కుగా ప్రకటించిన తీర్పు ఒక మైలురాయి. ఆధార్ వంటి కార్యక్రమాలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత డేటాను ఎలా వాడుకోవాలో స్పష్టమైన మార్గదర్శకాలు వచ్చాయి. ఇది మన డిజిటల్ జీవితంలో గోప్యత గురించి అవగాహన పెంచింది. అలాగే, 2018లో సెక్షన్ 377ని రద్దు చేసిన తీర్పు ా+దీూం సముదాయానికి న్యాయం చేసింది మాత్రమే కాదు; ఏం తినాలి, ఎవరిని ప్రేమించాలి, ఎలా జీవించాలి అనే నిర్ణయాలు పూర్తిగా వ్యక్తిగతమనే భావనను సమాజంలో బలపరిచింది. ఒకప్పుడు సంప్రదాయం పేరుతో అణచివేతకు గురైన విషయాలు ఇప్పుడు కుటుంబ చర్చల్లో భాగమయ్యాయి. అదే విధంగా, వ్యభిచారాన్ని నేరం కింద నుంచి తొలగించిన 2018 తీర్పు మహిళల స్వేచ్ఛను గౌరవించే దిశగా అడుగు వేసింది.

మహిళల హక్కుల విషయంలో సుప్రీం కోర్టు తీర్పులు చరిత్రను తిరగరాశాయి. 1997లో విశాఖ గైడ్‌లైన్స్ ద్వారా కార్యాలయాల్లో లైంగిక వేధింపులపై కఠిన నిబంధనలు రూపొందించడం మొదలు, 2017లో ట్రిపుల్ తలాక్‌ను అర్థరహితం చేసిన తీర్పు వరకు – ఇవన్నీ మహిళల జీవితాలను మార్చాయి. ట్రిపుల్ తలాక్ తీర్పు ముస్లిం మహిళలకు భద్రత కల్పించింది. ఒక్క మాటతో విడాకులు ఇచ్చే అన్యాయాన్ని రద్దు చేయడం వల్ల వేలాది మంది మహిళలు ధైర్యంగా నిలబడ్డారు. శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు (2018) సంప్రదాయం పేరుతో మహిళలపై విధించిన నిషేధాలను ప్రశ్నించింది. అలాగే, సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్ ఇవ్వాలని 2020 తీర్పు ఆదేశించింది. ఇవి కేవలం కోర్టు ఆదేశాలు మాత్రమే కాదు; ఇంటి గోడల మధ్య, కుటుంబ సమావేశాల్లో మహిళల స్థానం గురించి చర్చను రేకెత్తించాయి. ఫలితంగా, విద్య, ఉద్యోగం, నిర్ణయాధికారం వంటి రంగాల్లో మహిళలు మరింత బలంగా నిలుస్తున్నారు. ఇది లింగ సమానత్వం వైపు దృఢమైన పయనం.

మతం, సంప్రదాయం, రాజ్యాంగం మధ్య సమతుల్యత కాపాడే విషయంలో సుప్రీం కోర్టు ఎప్పుడూ సునిశితంగా వ్యవహరించింది. 2019లో అయోధ్య వివాదంపై ఇచ్చిన తీర్పు దశాబ్దాలుగా రాజకీయంగా వేడెక్కిన సమస్యను శాంతియుతంగా పరిష్కరించింది. రామ మందిర నిర్మాణానికి అనుమతి ఇవ్వడం, మస్జిద్ కోసం ప్రత్యామ్నాయ భూమి కేటాయించడం -- ఇది మత సామరస్యాన్ని కాపాడింది. అలాగే, హిందూ ఆలయాల్లో మహిళల ప్రవేశం, మస్జిద్‌లలో మహిళల హక్కులు వంటి అంశాల్లో రాజ్యాంగ సమానత్వాన్ని నొక్కి చెప్పింది. ఈ తీర్పులు కొందరిని అసౌకర్యానికి గురిచేశాయి, కోపం తెప్పించాయి కూడా. కానీ పాత సంప్రదాయాలను ప్రశ్నించకుండా సమాజం ఎదగదు. సుప్రీం కోర్టు ఆ ప్రశ్నలకు వేదికగా నిలిచి, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని పెంచింది.

పర్యావరణ రక్షణలో సుప్రీం కోర్టు పాత్ర అపారం. గంగా నది శుభ్రత కేసు, తాజ్‌మహల్ చుట్టూ పరిశ్రమల నిషేధం, అటవీ సంరక్షణకు సంబంధించిన తీర్పులు ప్రభుత్వాలను బాధ్యతాయుతంగా వ్యవహరించమని ఆదేశించాయి. ఢిల్లీ వాయు కాలుష్యం విషయంలో ఇచ్చిన ఆదేశాలు పటిష్ట చర్యలకు దారితీశాయి. 2020లో ప్లాస్టిక్ నిషేధం, 2023–24లో కార్బన్ ఉద్గారాలపై నిబంధనలు – ఇవి మన ఆరోగ్యం, భవిష్యత్ తరాల హక్కులను కాపాడుతున్నాయి. ఈ తీర్పుల వల్ల ప్రజల్లో పర్యావరణ అవగాహన పెరిగింది. ఇప్పుడు సామాన్యుడు చెట్లు నాటడం, ప్లాస్టిక్ తగ్గించడం వంటి చిన్న చర్యలు తీసుకుంటున్నాడు.

రాజకీయాలపై సుప్రీం కోర్టు ప్రభావం ఇంకా లోతైనది. 2024లో ఎలక్టోరల్ బాండ్లను అర్థరహితం చేసిన తీర్పు ఎన్నికల్లో పారదర్శకతను తీసుకొచ్చింది. రాజకీయ పార్టీల ఫండింగ్ గురించి సమాచారం ప్రజలకు అందేలా చేసింది. అలాగే, ఎమ్మెల్యేల అనర్హత, పార్టీ మార్పు వంటి అంశాల్లో జోక్యం చేసుకుని అధికార దుర్వినియోగాన్ని అరికట్టింది. ఆర్టికల్ 370 రద్దుపై 2023 తీర్పు జమ్మూ–కాశ్మీర్‌లో కొత్త రాజకీయ దిశను నిర్దేశించింది. ప్రభుత్వాలు "కోర్టు ఏమంటుంది?" అనే ఆలోచనతో విధానాలు రూపొందిస్తున్నాయి.

సామాజిక న్యాయంలోనూ సుప్రీం కోర్టు తీర్పులు కీలకం. రిజర్వేషన్లు, ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల చట్టం బలోపేతం, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ -- ఇవి సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించాయి. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా నియంత్రణ, ఫేక్ న్యూస్ వంటి కొత్త సవాళ్లపై కూడా కోర్టు దృష్టి పెట్టింది.

సామాన్య మనిషికి న్యాయం అందుబాటులో ఉందనే నమ్మకాన్ని పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (ా×ూ) ద్వారా కలిగించడం సుప్రీం కోర్టు గొప్ప కృషి. ఇది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు.

చివరిగా, సుప్రీం కోర్టు తీర్పులు క్లిష్టమైన చట్ట పదాలు మాత్రమే కాదు. అవి మన ఆలోచనల్లోకి, మాటల్లోకి, నిర్ణయాల్లోకి చొచ్చుకుపోతాయి. సమాజం ఒక్కసారిగా మారదు; కానీ ఈ తీర్పులు మార్పుకు బీజాలు వేస్తాయి. మరింత న్యాయమైన, సమానమైన, సహనశీలమైన భారతదేశం కోసం ఈ ప్రయాణం కొనసాగాలి.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

కవితా వచనం!

అభ్యుదయం అంటారు!
ప్రజలకోసం అంటారు!
ప్రజలకు అర్థమైతేనే
నువ్వుచెప్పేదంతా!
అర్థంకానిది వ్యర్థం!
వ్యర్థం ప్రజలకనర్థం!
సంస్కృతంలో రాసారు
జనానికి అర్థంకాలేదు!
తెలుగుపద్యాలుకూడా
సంస్కృత ఛాయ లోనే!
అర్థమయ్యేట్టు చెప్పిన
తొలికవి మన వేమన!
వచనకవిత్వం వచ్చింది
అందులోనూ పాండిత్యం
అర్థంకాని తికమక!
బుర్రగోక్కునేమకతిక!
నాది కవిత్వవచనం!
ఎవరు కాదంటారు?
ఛందోబందోబస్తులొద్దని
తేలిగ్గారాయమని శ్రీశ్రీ!
ప్రజలకు అర్థమయ్యేట్టు
రాసేదే సాహిత్యం!
పండిత సాహిత్యంకాదు
అది ప్రజాసాహిత్యం!
రాయండి! తమ్ముళ్లు
రాయండి!చెల్లాయిలు
'కవితావచనం' రాయండి
ప్రజల్ని కదిలించండి!
సత్యంమాత్రమేరాయండి
నిజాయితీగా రాయండి!
మోసంలేని,కండూతిలేని
ప్రతి అక్షరం సాహిత్యమే!
రాయండి!రాయండి!
నిర్భయంగా రాయండి!
'కవిత్వవచనం'రాయండి
'కవితావచనం'రాయండి!
రాయండి!రాయండి!
సామాన్యులకోసంరాయండి!
గుండెల్లోఅతుక్కుపోవాలి
రాయండి!రాయండి

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

అగ్రకుల పార్టీల సామాజిక న్యాయం ఒక భ్రమ

భారత రాజ్యాంగం పరిపాలనా నియమావళి మాత్రమే కాదు, శతాబ్దాలుగా కొనసాగిన కుల ఆధారిత అసమానతలను తొలగించి, అణగారిన వర్గాల్లో వెలుగు నింపే సామాజిక విప్లవ పత్రం. రాజ్యాంగ నిర్మాణానికి కేంద్ర బిందువు "సామాజిక న్యాయం". ఇది వ్యక్తుల మధ్య చట్టపరమైన సమానత్వంతో పాటు సమాజంలో పాతుకుపోయిన నిర్మాణాత్మక అసమానతలను సరిదిద్దడమే దీని లక్ష్యం. భారతదేశంలో ఇప్పటివరకు అగ్రవర్ణ పార్టీలన్ని సామాజిక న్యాయం పేరుతోనే అధికారంలోకి వచ్చాయి. అనేక పథకాలు, ప్రకటనలతో సామాజిక సమానత్వం దిశగా అడుగులు వేస్తున్నట్లు భ్రమ కల్పించారు. గరీబ్ హటావో పేరుతో కాంగ్రెస్ పార్టీ, అంత్యోదయ పేరుతో బిజెపి, సమసమాజం పేరుతో పలు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేపట్టాయి. కానీ సామాజిక న్యాయం నెరవేరలేదు. ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది రేషన్ బియ్యం మీద ఆధారపడి జీవిస్తున్నారు అంటేనే సామాజిక న్యాయ వైఫల్యానికి సజీవ సాక్ష్యం. తెలంగాణ టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రానికి మొదట దళిత ముఖ్యమంత్రినీ చేస్తానని చెప్పి మాట తప్పడం కూడా సామాజిక న్యాయానికి పాతరేసినట్టే. ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన విషయం..."సమ సమాజం, సమానత్వం అని అగ్రకుల నాయకుడంటే దోపిడి చేయడానికి బయలుదేరుతున్నాడని అర్థం, అదే మాట బహుజన నాయకుడు అంటే దోపిడి కులాల మీద యుద్ధానికి బయలుదేరుతున్న యోధుడని అర్థం". ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో అణగారిన వర్గాల చుట్టూ అలుముకున్న చీకటిని తరమడానికి డాక్టర్ విశారదన్ మహరాజ్ బయలుదేరాడు. చారిత్రకంగా బహుజన నాయకులైన పూలే, అంబేద్కర్, కాన్సిరాం ఉద్యమాలు అట్టడుగు వర్గాల విముక్తికి పునాదిగా నిలిచాయి.

సబ్బండ కులాల రాజ్యాంగ హక్కులను వ్యతిరేకించడమే.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధికి అడుగులు వేస్తున్నట్లు ప్రయత్నించింది. 2024 ఫిబ్రవరి 4న కులగణన చేయాలని క్యాబినెట్ లో తీర్మాణం చేశారు. 2025 ఫిబ్రవరి 4 కులగణనపై చర్చించారు. మరోవైపు అదే రోజు షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణ సిఫార్సులను తెలంగాణ ప్రభుత్వం ఆమోదించారు. ఈ అంశాలను పురస్కరించుకొని సమానత్వం, సాధికారత వైపు నడిపించడానికి గతేడాది ఫిబ్రవరి 4వ తేదీన "తెలంగాణ సామాజిక దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఆ ప్రత్యేక దినం గురించి ఊసేత్తకపోవడం గమనార్హం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అయ్యాయి అనే అంశం పట్ల చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక న్యాయం అనేది పాలనా విధానాల్లో, చట్టాల అమలులో, అవకాశాల సమాన పంపిణీలో స్పష్టంగా కనిపించాల్సిన మౌలిక ప్రజాస్వామ్య సూత్రం. జనాభా ప్రకారం అందరికీ సమాన అవకాశాలు కల్పనే సామాజిక న్యాయం. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వంకులగణన నిర్వహించి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇది సబ్బండ కులాల చారిత్రక అన్యాయాన్ని సరిచేసి ఒక అధికారిక అంగీకారం. కానీ చట్టరూపం దాల్చి, క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లోనే ఉండడమే దీనికి నిదర్శనం. మరోవైపు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి తెచ్చిన జీవో సైతం న్యాయవివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. నిబద్ధత లేని బీసీ రిజర్వేషన్ల బిల్లు తేవడమే దీనికి ప్రధాన కారణం. మరోవైపు బీసీ కోటా కోసం ఆధిపత్య వర్గ పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి, కమ్యూనిస్టు పార్టీలు ముసలి కన్నీరు కార్చడం శోచనీయం. ఈ పార్టీలన్నీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకపోవడం, అన్ని కలిపి కేంద్రంపై బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు ఒత్తిడి లేకపోవడం మరో చారిత్రక తప్పిదం. దీంతో సబ్బండ కులాలకు రాజ్యాంగం పరంగా చెందాల్సిన హక్కులను వ్యతిరేకిస్తున్నట్లు నిర్ధారణ అయిపోయింది. బహుజన పార్టీలు అధికారంలోకి రావడమే విప్లవం.

బీసీ రిజర్వేషన్లు తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి పెద్ద ఎత్తున ఉద్యమించింది. ఈ ఉద్యమం బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్, ఉమ్మడి ఏపీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బాలగోని బాలరాజు గౌడ్ గారి నేతృత్వంలో జరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ అంశం పక్కన పెట్టి పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఈ బీసీ ఉద్యమ ప్రభావంతో బీసీ ఎస్సీ ఎస్టీలు 86.4 శాతం సర్పంచ్ లుగా గెలవడం భారతదేశంలో అతి పెద్ద బహుజనుల సామాజిక విజయం. సామాజిక న్యాయం అంటే వెనుకబడిన 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి, సంపద, అధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కాలి. 10 శాతం లేని అగ్రవర్ణ పార్టీల చేతులో అధికారం ఉన్నప్పుడు సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుంది?. కేవలం ఇది భ్రమ మాత్రమే. బహుజన వర్గాల చేతిలో రాజ్యాధికారం ఉన్నప్పుడే సాధ్యం. ఇప్పటివరకు తమిళనాడులో డిఎంకె, ఉత్తరప్రదేశ్ లో బీఎస్పీ, సమాజ్ వాదీ పార్టీ, జార్ఖండ్ లో జార్ఖండ్ ముక్తి మోర్చా, బీహార్ లో ఆర్జేడి, జేడీ వంటి బహుజన పార్టీలతోనే సామాజిక న్యాయం జరిగింది. ఈ బహుజన పార్టీలు ఏమి చేయలేదని, అభివృద్ధి జరగలేదని అగ్రకుల పార్టీలు ప్రచారం చేస్తున్నారు. వాళ్ల ఉచ్చులో దళిత బహుజనులు పడి దారి తప్పుతున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. అసలు ఈ దేశంలో వేల ఏళ్లుగా వెనబడిన బహుజన పార్టీలు అధికారంలోకి రావడమే పెద్ద విప్లవం. బహుజన పార్టీలు అధికారంలో ఉన్నపుడు అట్టడుగు వర్గాల అభివృద్ధి జరగలేదనడం విడ్డూరం. తెలంగాణలో బీసీ–ఎస్సీ–ఎస్టీల హక్కులు, రాజ్యాధికార సాధన కోసం లక్ష కిలోమీటర్ల రథయాత్ర చేస్తున్న డాక్టర్ విశారదన్ మహరాజ్ గారి "మా భూమి యాత్ర" సామాజిక న్యాయ పోరాటంలో మరో కీలక మలుపు. బహుజనుల భవిష్యత్తు కోసం సాగుతున్న రాజకీయ యుద్ధం.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

తినే ప్రతి ముద్దలో ఆందోళన

భారత ఆహార భద్రత: వాస్తవాలు, సవాళ్లు, పరిష్కారాలు

2026 నాటికి భారతదేశంలో ఆహార భద్రత ఒక జాతీయ సమస్యగా మారింది. ప్రతి రోజు కోట్లాది మంది తీసుకునే ఆహారంలో కల్తీ, రసాయన అవశేషాలు, సంరక్షణ పదార్థాలు ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. FSSAI నివేదికలు, ICMR అధ్యయనాలు ఈ సమస్యలను స్పష్టంగా చూపిస్తున్నా యి. అయితే కొన్ని పాత గణాంకాలు అతిశయోక్తిగా ఉండటం వల్ల వాస్తవ చిత్రణ అవసరం.

చారిత్రక మార్పులు మరియు ప్రస్తుత పరిస్థితి

1960ల వరకు భారతీయ ఆహార వ్యవస్థ సహజ ఎరువులపై ఆధారపడింది. స్థానిక పంటలు, తక్కువ నిల్వ కాలం వల్ల కల్తీ తక్కువ. హరిత విప్లవం తర్వాత రసాయన ఎరువులు, పురుగుమందులు పెరిగాయి – 1960 నుంచి 2000 వరకు 800% వృద్ధి. ఇది నేల ఆరోగ్యాన్ని దెబ్బతీసింది.

2000 తర్వాత పట్టణీకరణ, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరిగాయి. 2025లో ఖీూూ× స్నైసెస్‌లో కల్తీపై జాతీయ డ్రైవ్ చేపట్టింది – నల్ల మిరియాలు, మిర్చి, జీలకర్రలో అనుమతించని రసాయనాలు గుర్తించారు. డిసెంబర్ 2025లో పాలు, పనీర్, ఖోయాలో కల్తీపై మరో డ్రైవ్ -- పంజాబ్‌లో 47% డైరీ నమూనాలు ఫెయిల్ అయ్యాయి.

ముఖ్య సమస్యలు: తాజా గణాంకాలు

పాల కల్తీ పాత సర్వేల్లో (2011) 68% నమూనాలు అనుమతించనివి. ఇటీవలి సర్వేల్లో (2022–2025) 14–20% నాన్–కంఫార్మింగ్. నీరు కలపడం, యూరియా, డిటర్జెంట్ ఇప్పటికీ సమస్యలు.

కూరగాయలు, పండ్లలో పురుగుమందుల అవశేషాలు 2024–2025లో 20–30% నమూ

పాడి కౌశిక్‌రెడ్డికి రాజకీయ పాడే కడతాం

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జల్పల్లి నరేందర్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రలో పాడి కౌశిక్ రెడ్డికి రాజకీయ పాడే కడతామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జల్పల్లి నరేందర్ నిన్న మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అన్నారు. ఇటీవల పోలీస్ అధికారులపై పాడి కౌశిక్ రెడ్డి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని రాజ్యాంగబద్ధంగా ఇది సబబు కాదని కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలపల్లి నరేందర్ మీడియా సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... బాధ్యతాయుతమైన పదవిలో పనిచేస్తున్న పోలీసు అధికారులపై అన్న వ్యాఖ్యలు చేయడం సబబు కాదు గతంలో మీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాంపరింగ్ చేసి ఇలాంటి అరాచకాలకు పాటుపడ్డారు తెలంగాణ ప్రజలకు తెలుస్తుందని ఈ సందర్భంగా అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనాన్ని చూసి భరించలేక కడుపుమంటతో పోలీసు అధికారులపై లాగుల తొండలేడుస్తా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. దీనిపై కేటీఆర్ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పి తెలంగాణ ప్రజలకు బాధ్యతాయుతమైనటువంటి ప్రతిపక్షపాత్రని నిర్వహిస్తే మంచిదని సూచించారు. గతంలో టిఆర్ఎస్ హయాంలో ఎంత దుర్మార్గమైనటువంటి పరిపాలనందించారో ప్రజలు చూసి అసహ్యించుకొని నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించి ప్రజా పరిపాలన వైపు సాగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజల క్షమాపణ చెప్పి బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు . ముఖ్యమంత్రి రేవంత్

రెడ్డి హయాంలో ప్రజలకు మంచి పథకాలు అంది మంచి ప్రజాపాలన జరుగుతుందని మీరు ఓర్వలేకనే ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు గాని వ్యక్తిగతవేకల గాని దిగుతున్నారు ఇది మంచి పరిణామం కాదు ప్రజాస్వామ్యంలోని హెచ్చరించారు. కెసిఆర్ తెలంగాణ జాతిపిత అని ఎవరికితాభించారు కానీ అది మంచిది కాదని ఆయన తెలంగాణ జాతిపిత కాదు తెలంగాణ సాగిపోతులకు పితాని అన్నారు. ఆచార్య జయశంకర్ 1500 మంది ఆత్మబలిదానం చేసిన తెలంగాణ అమరవీరులు జాతికి పితాలవుతారని ఈ సందర్భంగా వారు అన్నారు., టిఆర్ఎస్ హయాంలో గల్లి గల్లి కి బెల్టు షాపులు పెట్టి తెలంగాణ తాగుబోతులుగా తయారుచేసిన ఘనత కేసిఆర్ కు మాత్రమే దక్కుతుందని అన్నారు. తెలంగాణ పిత ఎలా అవుతారో చెప్పాలని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. జాతిపిత మహాత్మా గాంధీ కాలి గోటికి సరిపోనీ కేసీఆర్ ఎక్కడ ప్రపంచ ప్రజానీకాన్ని కదిలించినటువంటి శాంతి దూత మహాత్మా గాంధీ ఎక్కడ మహాత్మా గాంధీ పేరుకు మచ్చ లేకుండా ఉంటే అంతే చాలని అన్నారు. తెలంగాణలో మీరు ఎంత మొత్తుకున్నా ఎంత ఏడ్చిన ఎంత గగ్గోలు పెట్టినా తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్కు బండ కొట్టి రోజులు వచ్చినాయి మున్సిపల్ ఎన్నికల్లో భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొంది విజయ డంకా మోగించబోతున్నారని అన్నారు. ఇంకొక్కసారి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేతిలో చెప్పు దెబ్బలు తినడం ఖాయమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు టిఆర్ఎస్ హయాంలో పోలీసులను ఇంటి కూరగాయల నౌకరీగా పని చేపించుకున్నారని జలపల్లి నరేందర్ అన్నారు. ప్రజల్ని ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్మెయిల్ చేసి గెలిచిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇలాంటి పిచ్చికూతలు కూయడం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటు అని అన్నారు. బిడ్డ పాడి కౌశిక్ రెడ్డి నీకు రాజకీయంగా పాడెగడతామని ఘాటుగా హెచ్చరించారు. గోడ మీద పిల్లలకి చూసే కేసిఆర్ సోనియా గాంధీ కాళ్లు పట్టుకున్న రోజులు మరిచిపోయినాడు... తెలంగాణ ఇచ్చింది తెచ్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే సోనియా చలువ వల్లనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. తెలంగాణ ప్రజలారా ఇప్పటికైనా ఈ నక్కజిత్తుల కేసీఆర్ కేటీఆర్ మాటలను ప్రజలు విశ్వసించకుండా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీతో గెలిపించి టిఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టు లాగా చూపించాలని జలపల్లి నరేందర్ ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజయ్ యాదవ్, నసీరుద్దీన్, మిట్టు, బాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తా..

● ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : మాన్సూరాబాద్ డివిజన్ పరిధి లోని వీరన్నగుట్ట, సూర్యోదయ కాలనీల వాసులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని వారి కార్యాలయంలో పలు సమస్యల పై మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరన్న గుట్ట వాసులు మాట్లాడుతూ గతంలో డ్రైనేజీ, రోడ్లు మంజూరు కావడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. సూర్యోదయ కాలనీవాసులు మాట్లాడుతూ దాదాపు అన్ని అభివృద్ధి పనులు మీరు మంజూరు చేయడం జరిగిందని, కొన్ని చోట్ల సబ్ రోడ్ల నందు సీ.సీ.రోడ్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం లోని పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని వివిధ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. వీరన్నగుట్ట నందు పనులు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉందని కానీ, కొందరు తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి పనులకు అడ్డం పడడం జరుగుతుందని అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చిన అతి త్వరలోనే పనులను తప్పకుండా ప్రారంభం చేయడం జరుగుతుందని వారు హామీ ఇచ్చారు. సూర్యోదయ కాలనీ నందు నూతన సీ.సీ.రోడ్లు మంజూరుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మనసురాబాద్ డివిజన్ సీనియర్ నాయకులు జక్కిడి రఘు రెడ్డి, కేకేఎల్ గౌడ్, వెంకట్రావు, వీరన్న గుట్ట కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహ యాదవ్, జంగయ్య గౌడ్, చిన్న యాదవ్, ధనమ్మ, పరుశురాం, శ్యామల రాజు, సాగర్ రెడ్డి, రాములు, రమేష్ చారి, యుగేందర్ చారి, శ్రీనివాస్ రెడ్డి, రఘు యాదవ్, నర్సింహారావు, ఉదయ్, మహిళా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికహారంతో టీబి నియంత్రణ

తాండూరు, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : పౌష్టికాహారం తీసుకోవడం తోనే టీబీ నియంత్రించడం సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం తాండూరులో అదాని కంపెనీ ఆధ్వర్యంలో టీబీ, బాధితులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచిఓ రవీందర్ యాదవ్ హాజరై బాధితులకు కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ, బారిన పడిన బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరైన సమయంలో వ్యాధులను గుర్తించి చికిత్సలు తీసుకుంటే నయం చేసుకోవచ్చన్నారు. అదేవి ధంగా బాధితులు పోషక విలువలు ఉన్న పౌష్టికాహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి పెంపొందు తుందన్నారు. తద్వారా వ్యాధులను నియంత్రించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ డా. రవీంద్ర యాదవ్, డాక్టర్ సమీవుల్లా, అదాని కంపెనీ హెచ్.ఆర్ హెడ్ లింగన్న గౌడ బెల్లి, అదాని కంపెనీ హెచ్ ఓ డి నాగార్జున మరియు సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ విభాగంలో 'షాడో' పాలన

● ప్రైవేట్ వ్యక్తి చేతిలో సెక్షన్ ఆఫీసర్ బాధ్యతలు
● ఫైల్‌కు 40 వేలు వసూలు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం పెంచాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.మల్కాజిగిరి, మౌలాలి సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం ప్రస్తుతం వివాదాలకు కేంద్రబిందువులుగా మారాయి. మౌలాలి సర్కిల్ లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తూ మల్కాజిగిరి సర్కిల్ కు ఇన్చార్జిగా పనిచేస్తున్న సంగీత, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ వ్యక్తిని షాడో సెక్షన్ అధికారి గా నియమించుకోవడం చర్చనీయాంశమైంది,సదరు సెక్షన్ ఆఫీసర్ తన సొంత ఖర్చులతో ఒక ప్రైవేట్ వ్యక్తిని నియమించుకుని, అతనికి నెలవారీ జీతం ఇస్తూ తన అధికారిక విధులను అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ 'షాడో' అధికారి మల్కాజిగిరి, మౌలాలి సర్కిల్ కార్యాలయాలలో తిష్టవేసి అక్రమవసులకు అడ్డగా మార్చుకొని వ్యవహారాలను చక్కబెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, కొత్త భవనాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియలో ఫైళ్లను సదరు ప్రైవేట్ వ్యక్తే క్లియర్ చేస్తు ఫైల్ కు 40 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదులు అందిన భవనాల యజమానులతో బేరసారాలు సాగించడం, వివాదాలను సెటిల్ చేయడం ఇతని ప్రధాన పనిగా మారింది. సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటిపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు భారీగా వసూళ్లకు

పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ రికార్డులు,అధికారిక ముద్రలు కేవలం ప్రభుత్వ ఉద్యోగుల పర్యవేక్షణలోనే ఉండాలి.కానీ మల్కాజిగిరి, మౌలాలి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక ప్రైవేట్ వ్యక్తి పెత్తనం చెలాయిస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. అసలు అధికారి కేవలం సంతకాలకే పరిమితమై, వసూళ్ల పర్వం అంతా ఈ షాడో అధికారి నడిపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాధనాన్ని అక్రమంగా దండుకుంటూ, వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న ఇటువంటి ధోరణిపై మున్సిపల్ కమిషనర్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రూ.19 కోట్లతో ఉప్పల్ భగాయత్‌లో అభివృద్ధి పనులు

ఉప్పల్, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లే అవుట్‌లో ప్లాట్లను అమ్ముకొని గత ప్రభుత్వ పెద్దలు సొమ్ము చేసుకున్నారు. కానీ, ఇచ్చిన మాటను నిలుపుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేస్తూనే పోతున్నారు అని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. పలు పనులకు ఏకంగా రూ.19 కోట్ల నిధులను మంజూరు చేశారు అని సీఎం రేవంత్‌రెడ్డి కి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డికి, ఇతర ప్రభుత్వ పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు.మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ మంజూరైన పనులు, నిధుల వివరాలు రూ.9.80 కోట్లతో లే అవుట్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం.రూ.6 కోట్లతో కమ్యూనిటీ సెంటర్ భవనానికి, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కంపౌండ్ వాల్ నిర్మాణం. ఇదే కాకుండా ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా అభివృద్ధి, వాచ్‌మెన్ గది, గ్రీనరీ ఏర్పాటు, తదితర పనులను చేపట్టనున్నారు.రూ.3.10 కోట్లతో లే అవుట్‌లోని ఖాళీ స్థలాల పరిరక్షణకు కంపౌండ్ వాల్స్ నిర్మాణం.రూ.10 కోట్లతో లే అవుట్‌లో రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు.రూ.3 కోట్లతో కమ్యూనిటీ సెంటర్ నిర్మాణం. అని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించాకోవాలి

● జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : శంకర్‌పల్లి మున్సిపల్ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.శంకర్ పల్లి మునిసిపల్ కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను మరియు కౌంటింగ్ నిర్వహించే ఆడిటోరియం ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.మునిసిపల్ కార్యాలయాన్ని,ఆదర్శ పాఠశాల,మరియు కౌంటింగ్ నిర్వహించే ఆడిటోరియం ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈనెల 11వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. అదేవిధంగా 14వ వార్డు పరిధిలోగల ఆడిటోరియంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఓట్ల లెక్కింపుకు కావలసిన ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ ఏజెంట్ల గురించి అధికారులతో ఆరా తీశారు.కలెక్టర్ వెంట తహ సిల్దార్ సురేందర్,ఎంపీడీవో వెంకయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్ కుమార్,సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నెక్నంపూర్‌లో అక్రమ కట్టడాలపై హైడ్రా చర్యలకు హైకోర్టు మద్దతు

● ప్రజా స్థలాలను కాపాడిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : నెక్నంపూర్ డివిజన్ పరిధిలో అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులు చేపట్టిన చర్యలకు తెలంగాణ హైకోర్టు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ప్రజల కోసం కేటాయించిన స్థలాలను అక్రమ ఆక్రమణల నుంచి కాపాడేందుకు శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గత ఏడు సంవత్సరాలుగా నిరంతర పోరాటం కొనసాగిస్తోందని అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. చట్టబద్ధత రిజిస్టరు నంబర్ 543/2021 కలిగిన ఈ కాలనీలో సుమారు రూ.30 కోట్ల విలువైన 1250 గజాల పార్కు స్థలం, 800 గజాల కమ్యూనిటీ హాల్ స్థలం, 600 గజాల సెప్టిక్ ట్యాంకు స్థలాలను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కాలనీ అధ్యక్షుడు బొమ్మ ఉపేందర్నాథ్ రెడ్డి హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న హైడ్రా అధికారులు జనావాసాలు లేని, అనధికారంగా నిర్మించిన కట్టడాలను కట్టడి చేసి, వాటిని తమ ఆధీనంలోకి తీసుకుంటూ చర్యలు చేపట్టారు. ఈ చర్యలను అడ్డుకునేందుకు కొందరు వ్యక్తులు తప్పుడు కథనాలతో హైకోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినప్పటికీ, అవి ఫలించలేకపోయాయి.రిట్ పిటిషన్ నంబర్ 29073పై విచారణ చేపట్టిన హైకోర్టు, హైడ్రా అధికారులు చేపట్టిన చర్యలు చట్టబద్ధమైనవేనని స్పష్టం చేస్తూ, యథావిధి పరిస్థితిని కొనసాగించాలని గురువారం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా, అక్రమ కట్టడాలకు పైపై రంగులు వేసి పూర్తయిన భవనాలుగా చూపిస్తూ అమ్మకానికి పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. ప్రజలను మోసగించేందుకు బోకస్ వెల్ఫేర్ సంస్థలు, మధ్యవర్తులను ఏర్పాటు చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు బొమ్మ ఉపేందర్నాథ్ రెడ్డితో పాటు అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ బోకస్ వెల్ఫేర్ సంస్థల మాటలను గానీ, మధ్యవర్తులను గానీ నమ్మవద్దని హెచ్చరించారు. అక్రమ కట్టడాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గతంలో గ్రామ పంచాయతీ పాలన సమయంలో ప్రజా స్థలాలను కొంతవరకు కాపాడినప్పటికీ, తరువాత మునిసిపల్ కౌన్సిల్ ఏర్పడిన అనంతరం కొందరు అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజా స్థలాల కబ్జాలు పెరిగాయని అసోసియేషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజా స్థలాల రక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, చట్టబద్ధమైన మార్గాల్లో చివరి వరకు నిలబడతామని శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

తాండూరు, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : బిఆర్ఎస్ పార్టీతోనే అబివృద్ధి సాధ్యమని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కోట్రిక విజయలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారం సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయ తగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాండూర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గా తాండూర్ ప్రజలకు సేవలు అందించామని ఆ సేవలకు గుర్తింపుగానే మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మా కుటుంబ సభ్యులకు టికెట్ కేటాయించారనిని గుర్తు చేశారు. మా కోడలిని ఆశీర్వదించి గెలిపిస్తే వార్డు నెంబర్ 24ను లో సిసి రోడ్ల నిర్మాణం మురుగు కాలువలు మిషన్ భగీరథ త్రాగునీటితో ఇంటింటికి అందిస్తామన్నారు. దూరంగా ఉన్న రేషన్ షాపును మల్ రెడ్డి పల్లి లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా బాలాజీ నగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, కనీసం ట్రాన్స్ఫార్మర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మేం గెలిచిన వెంటనే అక్కడ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మల్రెడ్డిపల్లి పరిధిలో స్మశాన వాటిక ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. తాండూర్ లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని మా చైర్మన్ హయంలో తాండూరు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని 24వ వార్డును మున్సిపాలిటీలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. వార్డు ప్రజల సహకారం కోరిక మేరకే బరిలో నిలిచామని వార్డులో గులాబీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్

హయత్‌నగర్, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : సిఐటీయు హయత్ నగర్ సర్కిల్ సమావేశము ఆటోనగర్ లో ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధ్యక్షుడు ముషం నరహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ హాజరైనారు. ఈ సందర్భంగా సర్కిల్ కమిటీ సభ్యులను ఉద్దేశించి చంద్రమోహన్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లును ఉపసంహరింప చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మాజీ ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జిహెచ్ఎంసి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, హయత్ నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, సిఐటియు నాయకులు ఆంజనేయులు, సుభద్ర, సుగుణ, నరసింహ, సుందర్ రావు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపు పరిగికి సీఎం రాక...

● భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పి
● సీఎం సభకు భారీగా తరలిరానున్న జనం
● ప్రజలకు అసౌకర్యం కలగకుండా పగడ్బందీ ఏర్పాట్లు
● వికారాబాద్ ఎస్పీ స్నేహ మేహ్రా

వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ స్నేహమే హ్రా పరిశీలించారు.ఈ నెల 7 న పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామం లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను పురస్కరించుకుని, జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా గురువారం సభా ప్రాంగణాన్ని పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ సభ నిర్వహించనున్న స్థలం, ప్రముఖులు కూర్చునే డి-రింగ్ భద్రతా ప్రాంతం, ప్రజలు కూర్చునే విభాగాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, అత్యవసర వాహనాల రాకపోకల మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి రాక కోసం సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించి, భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం సభకు హాజరయ్యే అశేష జనవాహినిని దృష్టిలో ఉంచుకుని వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, పాదచారుల సౌకర్యాలు, బారికేడింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్స్, అంబులెన్సులు, ఫైర్ సర్వీస్ సిబ్బంది అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా బందోబస్తు స్కీమ్‌పై స్థానిక పోలీస్ అధికారులు ఇతర విభాగాలతో సమీక్ష నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణ, గుంపు నియంత్రణ వంటి అంశాలపై పలు కీలక సూచనలు చేశారు. ప్రతి అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలతో సమన్వయంతో కలసి

పని చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా, విజయవంతంగా ముగిసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, డి సి ఆర్ బి డీఎస్పీ జానయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, ఏ.ఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి
- ఎంపీ కాంగ్రెస్ పార్టీనే..
- నేడు ప్రతిపక్షాలకు ఓటేసిన ప్రయోజనం లేదు
- హస్తం గుర్తుపై ఓటేద్దాం అభివృద్ధిని సాధిద్దాం
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆయన గురువారం వనపర్తి పట్టణంలోని 12వ వార్డు రాజనగరంలో, వనపర్తి పట్టణంలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాజనగరం 12వ వార్డు అభ్యర్థి అయిన నక్క రాణి రాజు , 11వ వార్డు అభ్యర్థి అయిన తులసి తిరుపతయాదవ్ ని గెలిపించాలని కోరుతూ ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎన్నికల ప్రచారానికి ఆయా వార్డుల్లోకి వెళ్లిన ఎమ్మెల్యేకి కౌన్సిలర్‌గా పోటీలో ఉన్న అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో, మంగళహారతులతో, కుంకుమ తిలకం దిద్ది, పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం మూడు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, రానున్న మరో 5 సంవత్సరాలు కలుపుకొని మొత్తం 8 సంవత్సరాల కాలం కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంటుందని అధికార పార్టీకి ఓటేస్తేనే వాడ వాడన అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు హస్తం గుర్తుపై ఓటేసి పోటీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వనపర్తి లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి, నేనున్నానని,రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నారని, మన ఎంపీగా డా: మల్లురవి ఉన్నారని, కౌన్సిలర్లుగా కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఉంటేనే పట్టణాల్లో వేగవంతంగా అభివృద్ధి సాధ్యమవుతుందని,ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటేసిన ఎలాంటి ఉపయోగం ఉండదని, ప్రజలు దీనిని గమనించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పది సంవత్సరాల బిఆరెస్ పాలనలో వార్డులలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, కేవలం కమిషన్ను దండుకోవడం కోసం చెరువు కట్టల మరమ్మత్తు చేపట్టి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేవలం రెండు సంవత్సరాలలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు.33 వార్డులల్లో కేవలం మౌలిక సదుపాయాల కోసం దాదాపు 100 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, కాలనీలలో విద్యుద్దీకరణ, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వనపర్తి పట్టణంలోని 33 వార్డులలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇందుకు సహకరించగలరని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు పార్టీ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో వార్డును అభివృద్ధి చేస్తా..

- బీఆర్ఎస్ అభ్యర్థి సాతాని శ్రీశైలం

సదాశివపేట, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తనని ఆశీర్వదించి గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి సాతాని శ్రీశైలం తెలిపారు. గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లకు కారు గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ఇంటింటికి పంపిణీ చేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. వార్డు ప్రజలు ఈ విషయాన్ని గమనించి కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వార్డు ఇంచార్జి అనిల్ రెడ్డి , కార్యకర్తలు, మహిళలు,పాల్గొన్నారు.

సదాశివపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సదాశివపేట, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సదాశివపేట పట్టణంలోని 26 వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని మాజీ ఎమ్మెల్యే ,టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గురువారం సదాశివపేట పట్టణంలో పర్యటించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పట్టణంలో తిరుగుతూ ప్రజలకు అభివాదం చేశారు.. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ పట్టణాల అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సదాశివపేటలో కాంగ్రెస్ జెండా ఎగరాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు,మాజీ కౌన్సిలర్ లు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల భూమికి హద్దులతో భూ ఆధార్

నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : భూములకు ఆధునిక సాంకేతికతో కచ్చితమైన హద్దులు, నిర్దిష్టమైన కొలతలు నిర్ణయించి రైతులకు భూ ఆధార్ ఇచ్చేందుకు ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు గ్రామ పటాలు లేని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి రీ సర్వే చేయాల్సి ఉంటుందని, ఆధునిక సాంకేతిక పరికరాలతో భూమి సరిహద్దులు, కమతాలకు నిర్దిష్టమైన కొలతలు నిర్దేశించడం జరుగుతుందని ఆమె తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలో గుర్తించిన మూడు గ్రామాలలో రీ సర్వే కు సంబంధించి ఏ డీ సర్వే ల్యాండ్, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ వివాదాలు పెరగడంతో రైతుల భూములకు నిర్దిష్టమైన కొలతలు చేసి భూ ఆధార్ ఇవ్వడం వల్ల వాటికి చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం ఈ భూముల రీ సర్వే ను ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. రీ సర్వే లో భాగంగా జిల్లాలోని నారాయణపేట మండలం శేర్నపల్లి, నర్వ మండలంలోని జంగం రెడ్డి పల్లి, కొత్తపల్లి గ్రామాలను ఎంపిక చేసిందని చెప్పారు. ఎంపిక చేసిన శేర్నపల్లి గ్రామంలో 1567 ఎకరాలు, జంగం రెడ్డి పల్లి లో 1500 ఎకరాలు, కొత్తపల్లి గ్రామంలో 1167 ఎకరాల పూర్తి విస్తీర్ణం లో రీ సర్వే చేసి ఆయా గ్రామాలకు సరిహద్దులు ఏ శివార్లు, ప్రభుత్వ భూములు, రోడ్లు, భవనాలు,అటవీ, దేవాదాయ, శిఖం భూములను గుర్తించి పూర్తి స్థాయి మ్యాపులను రూపొందించాల్సి ఉంటుందన్నారు. అయితే రీ సర్వే కంటే ముందు రోజు ఆయా గ్రామంలో టామ్ టామ్ వేయించాలన్నారు. ఆయా గ్రామాలలో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు రీ సర్వే గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యాలయాల్లో పట్టదారుల వివరాల ప్రదర్శించాలన్నారు.సర్వేలో మొదట భూములకు సరిహద్దులు నిర్ధారించి పహాణి ప్రకారం పట్టాదారులు, అనుభవదారుల సమక్షంలో ప్రతి భూమికి సరిహద్దులు,ఆక్షాశీశాలు, రేఖాంశాలను గుర్తిస్తారని ఆమె

తెలిపారు. శుక్రవారం నుంచి ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్,సర్వే ల్యాండ్ ఏ.డీ. వేణు గోపాల్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, నారాయణ పేట తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం హాల్లో ఏఈవోలతో ఏర్పాటుచేసిన ఆయిల్ ఫామ్ సాగు సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆయిల్ ఫాం సాగు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. జిల్లాలో 3500 ఎకరాలు ఆయన ఆయిల్ పామ్ సాగు చేయడానికి టార్గెట్ నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఏఈఓ 25 ఎకరాలు టార్గెట్ పెట్టుకొని రైతులచే ఆయిల్ పాం సాగు చేయించాలని తెలిపారు. రైతులకు ఆయిల్ పంట సాగుపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సర్పంచులకు కూడా ఈ పంట పట్ల అవగాహన కల్పించాలన్నారు. వారం వారం ఎలాంటి ఫలితాలు వస్తున్నాయి నమోదు చేసుకొని ఆయిల్ పామ్ పంట వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఏడాది టార్గెట్ పూర్తికానందున కలెక్టర్ వ్యవసాయా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారైనా టార్గెట్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలోని నర్వ మక్తల్ మాగనూరు కృష్ణ మరికల్ ధన్వాడ నారాయణపేట దామరగిద్ద ఊట్కూరు గుండు మాల్ కొత్తపల్లి కోస్గి మద్దూర్ మండలాల్లో ఆయిల్ ఫాం సాగు చేయడానికి వీలుంటుందని ప్రతి ఏ ఈ ఓ రెండు వారాలలో ఆయిల్ పాం పంటను రైతులు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ హార్టికల్చర్ అధికార సాయిబాబా , ఆయిల్ పేడ్ అధికారులు కో-ఆపరేటివ్ అధికారులు ఆంజనేయులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు..

తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

ఊర్కొండ, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఇప్పపహాడ్, జకినాలపల్లి గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన వార్డు మెంబర్స్, పంచాయతీ కార్యదర్శులతో రాబోయే వేసవిలో ప్రజలు ఎలాంటి త్రాగునిటి సమస్యలు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని, త్రాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని, రిపేరు చేయాల్సిన బోర్ మోటార్లు ఏమైనా ఉంటే వాటిని రిపేరు చేయించుటకు, పైపు లైన్ లీకేజిలు బాగుచేయించుటకు, హ్యాండ్ పంపులు రేపేరు చేయించుటకు, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయుటకు లీజ్ బోర్లు మాట్లాడుకొని సిద్ధంగా ఉండుటకు సూచనలు చేయడం జరిగింది. అలాగే అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టి గ్రామాలను పరిశుభ్రతతో ఉంచుటకు చర్యలు తీసుకొనుటకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రోహిత్, ఎంపీ ఓ లక్ష్మణ్, సర్పంచ్ లు సునీత రాజశేఖర్ రెడ్డి, కదిరే శేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు ముస్తఫా, పద్మ, ఉపసర్పంచులు భాగ్యరాణి శివ, రాజశేఖర్, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను ఓడించాలి
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి

మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.గురువారం మెదక్ పట్టణంలోని 5,7,8,9,10 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు మామిళ్ళ. ఆంజనేయులు, మాయ.అనురాధ శ్రీనివాస్, మాయ.గంగామణి మల్లేశం,జుబేర్ అహ్మద్,వనం. లత వెంకటేష్ లకు మద్దతుగా ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే రెండేళ్లు గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, అందువల్ల కాంగ్రెస్కు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదన్నారు.ఆరు గ్యారెంటీల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మా అక్క చెల్లెళ్లకు రూ.2,500 జీవన భృతి, పెన్షన్ల పెంపు జరగలేదన్నారు.పంటల సాగుకు కేసీఆర్ హయంలో నిరంతరంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేసామని,ప్రస్తుతం 12 గంటలు కూడా సక్రమంగా రావడం లేదని వివరించారు.కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. నేను 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. కానీ రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎప్పుడు రాలేద ని పేర్కొన్నారు. మెదక్ మున్సిపల్ లో బి ఆర్ ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు, పట్టణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజాగౌడ్ మాజీ ఎంపీపీ కిష్టయ్య, వార్డ్ ఇన్చార్జిలు గట్టయ్య,షాకీర్, ప్రభాకర్,ఎంబిపూర్ మహేష్,

రంగారావు,రాజ్ కుమార్, స్వామి, లాలు నాయక్,అంటోని,వినయ్, నాయకులు లింగా రెడ్డి, జైపాల్ రెడ్డి, సోములు,ఫాజిల్, కండెల నర్సింలు,గోపాల కృష్ణ,హరి, ఓమర్ ఫారుక్,స్వామి నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడా నైపుణ్యంలో ప్రావీణ్యం కలిగి ఉండాలి

- గ్రామస్థాయిలో ఉన్న క్రీడాకారులకు సీఎం కప్పు ప్రత్యేక వేదిక
- ప్రతి ఓటమి వెనక గెలుపు తథ్యం
- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి

వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రెండవ ఎడిషన్ లో భాగంగా గురువారం గోపాల్ పేట మండలం లో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులతో కలిసి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వల చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ... పూర్వం రోజుల్లో క్రీడలకు అంతగా ప్రాధాన్యత ఉండేది కాదని, గ్రామీణ ప్రాంతంలో ఆటలాడుదాం అనుకున్న మైదానాలు ఉండేవి కావని, రేవంత్ రెడ్డి సర్కార్ లో ప్రజా పాలన ప్రభుత్వం వచ్చాక సీఎం కప్పు మొదటి ఎడిషన్, రెండవ ఎడిషన్ ద్వారా

లక్షల్లో విద్యార్థులు పాల్గొని క్రీడా స్ఫూర్తిని ఘనపరుస్తున్నారన్నారు.జీవితంలో ఓడిపోతే చెడిపోయినట్లు కాదని, ఓటమి అనేది గెలుపు కోసం నిరంతరం శ్రమించే యోధులుగా చరిత్రలో నిలుస్తారని అన్నారు. గ్రామస్థాయిలో ప్రతిభ ఘనపరిచిన క్రీడాకారులను వారి నైపుణ్యతను బట్టి అకాడమీలో చేర్పించి ప్రత్యేక శిక్షణ ఇప్పించి జాతీయస్థాయిలో రాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఎలాంటి చెడు వ్యసనాలకు వెళ్ళొద్దని ప్రజా ప్రభుత్వం యువత కోసం మానసిక ఉల్లాసం, క్రీడా దృఢత్వం , క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు సీఎం కప్పు మొదటి ఎడిషన్, రెండవ ఎడిషన్ వంటి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు.గత ప్రభుత్వా హాయంలో క్రీడారంగానికి 10 ఏళ్ల కాలంలో 350 కోట్లు కేటాయించి, క్రీడాలను, క్రీడాకారులను, విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు.రేవంత్ రెడ్డి సర్కార్ లో రెండేళ్ల కాలం వ్యవధిలో 850 కోట్లు కేటాయిస్తూ.. క్రీడాకారుల కోసం ఉన్న పాత జీవోలను మారుస్తూ, కొత్త పాలసీలను తెచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. దీప్తి జీవాంజి వంటి క్రీడాకారిణి నిరుపేద కుటుంబంలో పుట్టి పారీస్ పారా ఒలంపిక్‌లో కాంస్యం పథకం సాధించే విషయాన్ని గుర్తు చేశారు. అలాగే దీప్తి జీవాంజికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి రూపాయలు నజరాన ఇచ్చిన విషయం గూర్చి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్ యాదవ్,జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్, డీఈవో అబ్దుల్ గని, సురేందర్ రెడ్డి, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సేవ చేయడమే లక్ష్యం

- సర్పంచ్ బెక్కర సునీత రాజశేఖర్ రెడ్డి

ఉర్కొండ, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : పేద ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యమని ఊరుకొండ మండలంలోని ఇప్ప పహాడ్ గ్రామ సర్పంచ్ బెక్కెర సునీత రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన కానుగుల అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది, కావున ఈ విషయాన్ని తెలుసుకున్న ఇప్పపహాడ్ గ్రామ సర్పంచ్ బెక్కర సునీత రాజశేఖర్ రెడ్డి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తక్షణ సహాయం 10000/- రుపాయలు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుబ్బ రాములు, దుబ్బ మల్లేష్, పాపిశెట్టి ప్రవీణ్, ఎన్నం కిషోర్ రెడ్డి, నాగరాజు, రాజు, రాఘవేందర్, శివ తదితరులు పాల్గొనడం జరిగింది.

భద్రకాళి మాధవీధుల నిర్వాసితులను ఆదుకుంటాం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్..
- కలెక్టరేట్‌లో భద్రకాళి మాధవీధుల కాలనీవాసులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష

హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : భద్రకాళి మాధవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి మాడవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలతో డబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కుడా, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్లు కోల్పోతున్న వారు తమ అభిప్రాయాలను కలెక్టర్ కు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న తమకు మరొకచోట ఇండ్లు ఇవ్వాలని, కల్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రస్తుతం భద్రకాళి మాధవీధుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సహకరిస్తున్నందుకు కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరఫున ప్రయోజనాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి, ఫిబ్రవరి 05 (జనంసాక్షి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. దేవాదుల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లబెల్లి మండలంలోని రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో మూడు చెక్కలపల్లి లింక్ మెయిన్ కెనాల్ ద్వారా ఎమ్మెల్యే మాధవరెడ్డి గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో 5 వేల ఎకరాల పంటకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కుమారస్వామి, ఏఈ స్వామి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి మాలోత్ రమేష్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల మరమ్మతులు వేగవంతం చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : జిల్లా పరిధిలోని జాతీయ రహదారులకు అవసరమైన మరమ్మత్తులను తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో జాతీయ రహదారి సంస్థ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని, రహదారుల వెంట పటిష్టమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో సూచిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు, ఇతర రోడ్ మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన, మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. చేపడుతున్న భద్రతా చర్యల ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జాతీయ రహదారి సంస్థ ఇంజనీరింగ్ అధికారి సుభాష్ బాబు, ఆర్ అండ్ బి డీఈఈ భీమ్ సింగ్, మున్సిపల్, ఇంజనీరింగ్, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల కుమారస్వామి జాతర అభివృద్ధి చేశాం : మంత్రి సీతక్క

ములుగు బ్యూరో,ఫిబ్రవరి05(జనం సాక్షి): ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలో బాలకుమారస్వామి జాతర సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క పాల్గొని ఆలయ మరమ్మతుల పనులకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు 5 లక్షల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ బాలకుమారస్వామి జాతరకు రావడం సంతోషంగా ఉందని గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు,సన్న బియ్యం,సీసీ రోడ్లు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని బాలకుమారస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆయా ప్రాంతాల గ్రామ సర్పంచులు,ఉప సర్పంచులు గ్రామస్థులు,మహిళలలు,భక్తులు పాల్గొన్నారు.

మేడారం జాతర వివిఐపి రహదారిని పరిశీలించిన సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు

ములుగు బ్యూరో, ఫిబ్రవరి 05 (జనం సాక్షి): తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వివిఐపి వాహనాలు వచ్చే రహదారిని,వివిఐపి వాహనాల పార్కింగ్ స్థలాన్ని,మేడారం తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు అధికారులతో మాట్లాడుతూ జాతర సమయం లో వివిఐపి వాహనాలు వచ్చే మార్గం లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయో వాటి నివారణ చర్యలు ఏ విధంగా తీసుకోవాలనే అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.2026 మహా జాతరలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని 2028 జాతరలో సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీగా ప్రణాళికల సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే జాతరలో భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తుందని జాతర విజయవంతం చేయడానికి కృషిచేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, ఆర్టీసీ,పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హస్తం జోరు.. కారు బేజారు..

- రోజురోజుకు డీలా పడుతున్న బీఆర్ఎస్
- ప్రభుత్వ పథకాలే కాంగ్రెస్ కు అస్త్రం
- మంత్రుల వరుస పర్యటనలతో పెరిగిన 'జోష్'
- ఈ నెల 8న జిల్లాకు రానున్న సీఎం
- మరింత పుంజుకోనున్న కాంగ్రెస్
- హస్తం వైపు చూస్తున్న మున్సిపల్ చైర్మన్ పీఠం

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి మున్సిపాలిటీలో హస్తం జోరుకు.. కారు బేజార్ అవుతుంది.. రోజురోజుకు బీఆర్ఎస్ డీలా పడుతుంది.. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అభివృద్ధి, సంక్షేమ పథకాలే అస్త్రంగా ప్రజల్లో దూసుకుపోతున్నారు.. భూపాలపల్లి వివిధ శాఖల మంత్రులు వరుస పర్యటనలు చేయడం కాంగ్రెస్ లో 'జోష్' పెరిగింది.. ఈ నెల 8న జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి రానుండడం కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుని, బలోపేతం కానుంది.. ఈ రసవత్తర పోరులో మున్సిపల్ చైర్మన్ పీఠం హస్తం వైపు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి..మున్సిపల్ ఎన్నికలు భూపాలపల్లి జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి.. మరో పార్టీకి చోటు లేకుండా చేయడమే ఎజెండాగా రాజకీయ ఎత్తుగడలు వేస్తున్న కాంగ్రెస్ ఆ మేరకు ప్రచారంలో దూకుడు పెంచింది.. రోజురోజుకు బీఆర్ఎస్ పట్టు కోల్పోతుండడం ఆ పార్టీని కలవరానికి గురిచేస్తుంది..

కాంగ్రెస్ పార్టీకి పెరిగిన బలం..

కాంగ్రెస్ పార్టీని విస్తరించడమే ఏకైక ఎజెండాగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ల నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ ముందుకు వెళ్తోంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పార్టీ పటిష్టతకు విశేష కృషి చేసి, ఎంపీ ఎన్నికల్లో ఈ ప్రాంతం నుండి మంచి మెజారిటీ అందించి, తన మార్క్ చూపించారు. అదేవిధంగా కొద్ది నెలల క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోను మెజారిటీ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే సత్తా చాటారు. అనంతరం ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లోను పార్టీకి చెందిన కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధికంగా గెలిపించుకుని, మున్సిపల్ చైర్మన్ పీఠం చేజిక్కించుకునేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ లు చాపకిందనీరులా విశేష కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్నికల షెడ్యూల్ రాకముందే యుద్ధం ప్రాతిపదికన నిధులు మంజూరు చేయించి, అంతే స్పీడ్ గా పనులు చేయించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క లతో పనులు ప్రారంభించడంతో పాటు రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రచారానికి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరు కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపినట్లు అయింది. మరో వైపు ఈ నెల 8న సీఎం రేవంత్ రెడ్డి కూడా జిల్లాకు రానుండడం ఆ పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోంది. దీనికి తోడు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ లు ఏరోజుకారోజు అభ్యర్థుల తరుపున ప్రచారాలు నిర్వహించడం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. మరోవైపు సీపీఐ, సీపీఎం లు కూడా పొత్తు పెట్టుకోవడం కాంగ్రెస్ కు మరింత కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు.

జిల్లాలో పట్టుకోల్పోతున్న బీఆర్ఎస్..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు ఎంతో పట్టుఉండేది. ప్రస్తుతం పరిస్థితులు భిన్నంగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ఎస్ కు గడ్డు పరిస్థితులు ఎదురవుతాయి. ఏ ఎన్నికలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బీఆర్ఎస్ ముఖ్యనేతలకు బెంగ పట్టుకుంది. ముఖ్యంగా పార్టీకి చెందిన కౌన్సిలర్ అభ్యర్థులు మొక్కుబడిగా ప్రచారాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్ ను భూపాలపల్లి ఎన్నికల ప్రచారానికి తీసుకువచ్చి పరువు నిలుపుకోవాలని పార్టీ ముఖ్య నేతలు భావిస్తున్నట్లు సమాచారం. ఏం చేసినా బీఆర్ఎస్ కు ఈ ఎన్నికలు కలిసి వచ్చేలా లేవు. మరోవైపు బీజేపీ కూడా ఉనికిని చాటుకునేందుకు తమవంతు ప్రచారాలు నిర్వహిస్తుండడం గమనార్హం.

మేడారం సమ్మక్క-సారక్క హుండీ లెక్కింపు ప్రారంభం

- లెక్కింపు ప్రక్రియను ప్రారంభించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ..

హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : హనుమకొండ టిటిడి కల్యాణ మండపంలో మేడారం సమ్మక్క-సారక్క వనదేవతల హుండీ లెక్కింపు ప్రక్రియను మంత్రి కొండా సురేఖ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, మేడారం జాతరకు దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను పూర్తిస్థాయి భద్రతా చర్యలు, పారదర్శక విధానాలతో లెక్కించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో, సంబంధిత అధికారుల సమక్షంలో నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి ఎలాంటి లోటు లేకుండా, ప్రతి రూపాయి జాగ్రత్తగా లెక్కించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. మేడారం సమ్మక్క-సారక్క వనదేవతల ఆశీస్సులతో జాతరను విజయవంతంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ. లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిశాక తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, ఇతర ఇబ్బందులు తలెత్తితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, మంచిర్యాల నగర పాలక సంస్థ జూనియర్ అకౌంట్ ఆఫీసర్ సిహెచ్. అనితాదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్

- పాల్గొన్న 100 మంది పోలీసు సిబ్బంది
- నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తూ, ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తుందని ఎస్పి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండడానికి ఫ్లాగ్ మార్చ్ ల నిర్వహణ జరుగుతుందని తెలిపారు, ఎన్నికల రోజు 200 మీటర్లు 100 మీటర్ల పరిధిలో గుమిగూడి ఉండవద్దని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా వాక్యాలు చేయవద్దని, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సోషల్ మీడియా వినియోగం చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా అనుమతులు లేని ర్యాలీలను సభలను నిర్వహించరాదని, విజయోత్సవ ర్యాలీలలో టపాకాయల పేల్చవద్దని తెలిపారు. ప్రశాంతమైన ఎన్నికలను జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరగడానికి ప్రజలందరూ సహకరిం చాలని తెలిపారు. ఎలాంటి సమాచారం ఉన్న డయల్ 100 ద్వారా తెలియజేయాలని తెలిపారు. అక్రమ మద్యం, నగదు, బహుమతులు లాంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, ఆదిలాబాద్ పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ప్రేమ్ కుమార్, బి ప్రణయ్ కుమార్, కె స్వామి, ఎస్ఐలు అశోక్, నాగనాథ్, రమ్య, విష్ణువర్ధన్, మధు కృష్ణ, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముయ్యాలమ్మ జాతరకు మంత్రి సీతక్కకు ఆహ్వానం

గోవిందరావుపేట (జనం సాక్షి) : శ్రీ సమ్మక్క వనదేవత మేనకోడలు అయినటువంటి ముయ్యాలమ్మ జాతర ఈనెల 11/02/2026 - 14/02/2026 వరకు జరుగు జాతరకు పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ దనసరి సీతక్కకి గురువారం గొంది వంశీయులు ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించారు. కుల పెద్ద గొంది రాంచందర్ (టీచర్),గొంది కిరణ్ ములుగు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు,చింత క్రాంతి మండల కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు, ముద్దబోయిన రాము మాజీ సర్పంచ్, భూక్య సుమలత పసర గ్రామపంచాయతీ సర్పంచ్ లు మంత్రివర్యులు దనసరి సీతక్క కి ముయ్యాలమ్మ జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. గొంది వంశీయుల ఇలవేల్పు ముయ్యాలమ్మ జాతరకు రావడంతో పాటు జాతర అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అప్పగింత

చిట్యాల, ఫిబ్రవరి 05(జనం సాక్షి): ఇటీవల తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన సర్వ శరత్ కుమార్, అనుప మహేష్, దువ్వల ప్రవీణ్ , కైలాపూర్ శివారు శాంతినగర్ గ్రామానికి చెందిన మేకల గణేష్ లకు చెందిన సెల్ ఫోన్ లను తిరిగి చిట్యాల పోలీసులు గురువారం అప్పగించారు. తమ మొబైల్స్ పోగొట్టు కున్నట్లు వీరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, సి ఈ ఐ ఆర్ టెక్నాలజీ సహకారంతో విచారణ జరిపి మొబైల్ ఫోన్లు గుర్తించినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు .దొరికిన మొబైల్ ఫోన్లను తిరిగి వాటి యాజమాన్లకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మొబైల్స్ గుర్తించడంలో కృషి చేసిన ఎస్సై శ్రావణ్ కుమార్, కానిస్టేబుల్ లాల్ సింగ్ కు సెల్ఫోన్ బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు), నిర్మల్‌కు చెందిన విద్యార్థులు సికిందర్, కృష్ణలు ఎంపికయ్యారు. ఈ ఎంపిక పట్ల జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జె. అంబాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శైలజ, జిల్లా క్రీడల అధికారి భూక్యా రమేష్ హర్షం వ్యక్తం చేస్తూ, ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో నిజామాబాద్ జిల్లా కమ్మరి పల్లిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఎంపికైన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : గురువారం నాగారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ఎరువుల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.షాపులో నిల్వ ఉన్న యూరియా బస్తాలు, ఇతర ఎరువుల వివరాలను ఏవో కృష్ణ కాంత్ ను అడిగి తెలుసుకున్నారు.స్టాక్ రిజిస్టర్లు 430 యూరియా నిల్వలు ఉన్నట్లుగా నమోదు చేయడం గమనించిన కలెక్టర్, యూరియా నిల్వలు స్వయంగా పరిశీలించారు. కొనుగోలు యాప్ ద్వారా రైతులకు యూరియా కొనుగోలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.ఈ యాప్ వల్ల రైతులకు లాభదాయకంగా ఉందా లేదా అలాగే యూరియా సరఫరా గురించి డీలర్ ఉపేందర్ ను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఎరువులు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

హాలియా మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ

హాలియా, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారుల సూచనల మేరకు హాలియా మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం కోతపల్లి రైతు వేదికలో జరిగింది. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, జోనల్ అధికారులు, శిక్షణ పర్యవేక్షకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులు, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, భద్రతా చర్యలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సవివరంగా వివరించారు. అలాగే జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రమేష్ ఈ కార్యక్రమానికి హాజరై, పోలింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగాఓ శాంతియుత వాతావరణంలో జరగాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా విధులు నిర్వహించాలని పోలింగ్ సిబ్బందికి స్పష్టంగా తెలిపారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు చేపట్టిన చర్యలో భాగంగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు.తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో 200 కోట్ల రూపాయలతో 20 ఎకరాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.సంబంధిత గుత్తేదారుకు భవన నిర్మాణ పనులు నాణ్యతతో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేయాలని, అవసరమైతే ఎక్కువ మంది పని వారిని పెట్టి భవనాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణుమాధవ్, ఎంపీడీవో, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డుల్లో హాలియా విద్యార్థినికి రాష్ట్రస్థాయి ర్యాంకు

హాలియా, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 33వ సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డులు, ఒలింపియాడ్ ప్రతిభావంతులు, యువ ప్రతిభావంతుల అవార్డుల ప్రధానోత్సవం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాలియా పట్టణంలోని వీఎస్ఆర్ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కే. సింధు రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి అవార్డు ప్రధానోత్సవంలో పాల్గొని బహుమతిని స్వీకరించింది. రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన విద్యార్థిని కే. సింధును పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు కరస్పాండెంట్ శివర్ల వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ ప్రతిభావంతురాలిని ఘనంగా అభినందించారు.

400 ఎకరాలకు గ్రామపంచాయతీ పన్ను వసూలు చేయాలి

మేళ్లచెరువు, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : గ్రామపంచాయతీ పరిధిలో 400 ఎకరాల్లో నడుస్తున్న మైహోమ్ సిమెంట్ పరిశ్రమకు పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయాలని స్థానిక న్యాయవాది కమతంనాగార్జున గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ లో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని పన్నువసుల్లో జరుగుతున్న అవకతలపై పాలకవర్గ సభ్యులకు వివరించారు. పూర్తి ఆధారాలతో లిఖితపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న మైహోం సిమెంట్ పరిశ్రమపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా కట్టిన అక్రమకట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మైహోమ్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం మేళ్లచెరువులో ఎన్ని ఎకరాల్లో పరిశ్రమ

నిర్మించుకున్నారు..? సంబంధిత పత్రాలు సమర్పించకుండా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మూడేళ్ల క్రితం యాజమాన్య ధ్రువీకరణ పత్రం పొందిన యూనిట్ -4 సిమెంట్ ప్లాంట్ కు ఈ ఏడాది 2025--26 ఆర్థిక సంవత్సరం గాను ఇటీవల రూ.65 లక్షలు పన్ను చెల్లించారని, గడచిన రెండేళ్లు రూ.80 లక్షలు పన్ను ఎగవేతకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.వెంటనే రెండేళ్ల బకాయి పన్ను రూ.80 లక్షలు వసూలు చేయాలని పాలకవర్గాన్నీ డిమాండ్ చేశారు.గ్రామంలో సామాన్యుల వద్ద ముక్కు పిండి పన్ను వసూలు చేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు మైహోం సిమెంట్ పరిశ్రమ వద్ద పన్ను వసూలు చేయకపోవడంపై సిగ్గుచేటు అన్నారు. పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయకపోవడం వల్ల గ్రామపంచాయతీ ఆదాయానికి ఏట రూ.3 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా మేళ్లచెరువు గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు మైహోమ్ సిమెంట్స్ యాజమాన్యం నుండి పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయాలని ఆయన కోరారు.

జనంసాక్షి కథనాల ఎఫెక్ట్..

- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. కదిలిన అధికార యంత్రాంగం..

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : పరిశ్రమల నుండి వదులుతున్న కాలుష్యంతో పాటు రసాయన కెమికల్ వ్యర్థ పదార్థాలను చెరువులోకి భూమిలోకి వదులుతున్న కథనాలపై అధికారులు కదిలి వచ్చారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ రీజినల్ కార్యాలయం నుండి అసిస్టెంట్ ఎన్విరాల్ మెంట్ ఇంజనీర్ సజీనా పరిశ్రమల నుండి వదులుతున్న రసాయన కెమికల్

వాటర్ ను శాంపిల్ సేకరించారు పరిశ్రమల చుట్టూ పరిశీలించి కలుషిత నీటిని చెరువులోకి భూమిలోకి వదులుతున్న దృశ్యాలను పరిశీలించారు రిపోర్ట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు షాద్ నగర్ పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులోని వెలిసిన పరిశ్రమల నుండి రాత్రి పగలు తేడా లేకుండా పరిశ్రమల గొట్టాల ద్వారా ఘోరమైన కాలుష్య పొగను విడుదల చేస్తున్న దుస్థితితో పొగ కాలుష్యంతో ప్రజలు శ్వాసకోస రోగాలతో పాటు చర్మవ్యాధులకు సంబంధించిన ఇబ్బందులు పడుతున్నారని కాలుష్యంతో పంటలు పండగ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనీ కెమికల్ వాటర్ తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయనే సమస్యలను జనంసాక్షి వరుస కథనాలు ప్రచురించడంతో అధికార యంత్రాంగం కదిలింది పరిశ్రమల నుండి వెలువడుతున్న కెమికల్ రసాయన వ్యర్థ పదార్థాలను గ్రామస్థులతో కలిసి పరిశీలించారు కెమికల్ నీటిని స్వాధీనం చేసుకున్నారు నివేదిక ఆధారంగా పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల లెక్కింపు కేంద్రాల పరిశీలన

సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : జిల్లాలో ఈనెల 11న మున్సిపాలిటీలకు జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్ లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్, ఎన్నికల అనంతరం లెక్కింపుకు సంబంధించి లెక్కింపు కేంద్రాలను జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేశారు.ఈ లెక్కింపు కేంద్రాల భద్రత ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని, లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లెక్కింపుకు సంబంధించిన అన్ని రకాల సామాగ్రిని ముందుగా సమకూర్చాలని, లెక్కింపుకు వచ్చే ఉద్యోగులు అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్ల చేయాలని కోరారు. భద్రతపరంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని, కౌంటింగ్ జరిగే పరిసరాల చుట్టూ పౌరుల సంచారం నిషిద్ధ ఆజ్ఞలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామరావు , సూర్యాపేట, కోదాడ ఆర్డీవో లు వేణుమాధవ్, సూర్యనారాయణ, డిఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్ హనుమత్ రెడ్డి, సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, రామారావు, తహసీల్దార్ కృష్ణయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనగల్ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని సందర్శించిన డైరెక్టర్ డా: రవీందర్ నాయక్

- రోగులకు అందుకున్న వైద్య సేవలపై సంతృప్తి..

కనగల్లు, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ప్రజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ గురువారం సందర్శించారు. జిల్లా వైద్య అధికరులతో కలిసి ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ ఆసుపత్రిలో వైద్యులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోజువారిగా వచ్చేఓ. పి, లు, వారికి అందజేసే మందుల రిజిస్టర్ లను తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఫ్రీజర్స్, వ్యాక్సిల నిల్వ పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆస్పత్రి చుట్టూ ఉన్న పరిసరాలు ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యం అందించినప్పుడే డాక్టర్లపై ప్రజలకు అపారమైన నమ్మకం ఏర్పడుతుందని గుర్తు చేశారు. స్త్రీల, పురుషుల వార్డులను సందర్శించి రోగుల కు అందుతున్న వైద్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెల 4 నుంచి 6 సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్నందుకుగాను వైద్య అధికారి డాక్టర్ రామకృష్ణ

తోపాటు ఆసుపత్రి సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం ఆసుపత్రి సమావేశ హాల్లో సిబ్బందితో పరిచయ కార్యక్రమం గావించారు. ఆయన వెంట జిల్లా వైద్య అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రాహుల్, డాక్టర్ దీప, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ పద్మ, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ నగేష్, డాక్టర్ గాదరి రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్స్ వెంకటేశం, షాబుద్దీన్, పద్మ, సూపర్వైజర్స్, స్టాఫ్ నర్సులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

మహేశ్వరం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : విధి నిర్వహణలో న్యాయవాదులపై బెదిరింపులు దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం కల్పించాలని యువ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పొన్నం రవీందర్ అన్నారు.గురువారం రాత్రి రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో పలువురు న్యాయవాదులు చేవెళ్ల బార్ అసోసియేషన్ లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న సప్న ను హత్య చేయడానికి ఖండించారు.అనంతరం న్యాయవాది స్వప్న ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పొన్నం రవీందర్ మాట్లాడుతూ... న్యాయవ్యవస్థలో కీలకమైన పాత్ర పోషించే న్యాయవాదిపై దారుణ హత్య చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించాలన్నారు.నిందితులకు కఠినమైన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజల న్యాయ హక్కుల కోసం పోరాడుతున్న న్యాయవాదులకు భద్రత కల్పించాలన్నారు.అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే నరసింహ,మహిళా న్యాయవాది భాగ్య, కుమారస్వామి,క్రాంతిరెడ్డి,కొంగల మోహన్ గౌడ్,నాగేష్,వీరన్న, విజయ్ కుమార్,గంగబోయిన రాంబాబు,పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

హత్యను చేదించిన పోలీసులు..

- మొయినాబాద్‌లో న్యాయవాది దారుణ హత్య
- భూమి వివాదమే కారణం నలుగురు నిందితుల అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు..
- వివరాలు వెల్లడించిన డీసీపీ యోగేష్ గౌతమ్

మొయినాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : మొయినాబాద్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన యువ న్యాయవాది హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీసీపీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న గోటిక స్వప్నను ఆమె సొంత అన్నతో పాటు మరో ముగ్గురు కలిసి భూమి వివాదం నేపథ్యంలో అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోటిక స్వప్నకు పూర్వీకుల నాలుగు ఎకరాల భూమి విషయంలో కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ భూమి కేతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 339లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వివాదమే హత్యకు ప్రధాన కారణమని దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు.

ఘటన వివరాలు..

ఫిబ్రవరి 4న బుధవారం ఉదయం సుమారు 9.30 గంటల

సమయంలో గోటిక స్వప్న తన తల్లి వెంకటమ్మతో కలిసి కేతిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న తమ భూమిలో సర్వే పనులు నిర్వహించేందుకు వెళ్లింది. సర్వే పూర్తయ్యాక వెంకటాపూర్ నుంచి నక్కలపల్లి వైపు వెళ్లే రహదారిపై తిరిగి వస్తుండగా, ముందుగానే పథకం ప్రకారం వచ్చిన నిందితులు ఇన్నోవా కారుతో స్వప్నను ఢీకొట్టారు. దీంతో ఆమె రోడ్డుపక్కన ఉన్న గోతిలో పడిపోయింది. అనంతరం నిందితులు కర్రలు, రాళ్లతో ఆమెపై దాడి చేసి, కొడవలితో గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర రక్తస్రావంతో స్వప్న అక్కడికక్కడే మృతి చెందింది. తన కుమార్తెను కాపాడేందుకు తల్లి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ అరెస్టులు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, చేవెళ్ల జోన్ డీసీపీ, ఏసీపీ చేవెళ్ల, మొయినాబాద్ ఎస్‌హెచ్ఓ పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాల ద్వారా చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

గురుకుల సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్, పాఠశాల, ఇంటర్, డిగ్రీ కళాశాలలో వసతి, సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గురువారం సూర్యాపేట మండలం బాలెంల గ్రామ సమీపంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్, పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్ లోని డైనింగ్ హాల్, స్టోర్ రూమ్,కిచెన్ షెడ్, లైబ్రరీ, ఈ క్లాస్ రూమ్, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు.కిచెన్ రూమ్ లో విద్యార్థులకు వడ్డించుటకు తయారు చేసిన భోజనం, పప్పు, కూరలు, సాంబారు పరిశీలించారు.కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, తదితర నిత్యావసరాలను కలెక్టర్ తనిఖీ చేసి తాజా కూరగాయలు, నాణ్యమైన వంట పదార్థాలను వంటల్లో వినియోగించాలన్నారు.వంట సామాన్లు, కూరగాయలు వెలుతురు తగిలే విధంగా పైన టేబుల్ మీద ఉంచుకోవాలని అన్నారు.డైనింగ్, వాష్ ఏరియా ఎప్పుడు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు.తరగతి గదులను పరిశీలించి ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.హాస్టల్ భవనంలో ఏమైనా మైనర్ రిపేర్లు ఉన్నట్లయితే ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్ లు

ఐ.నీల, అరుణ, ఉపాధ్యాయులు,అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోహరంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాలు, లోహరంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లు నష్టపోయి, 83,313 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 132 పాయింట్లు కుంగి, 25,642 వద్ద ముగిసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 83,757 వద్ద (క్రితం ముగింపు 83,817) ప్రారంభమైంది. ఒక దశలో 83,784 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.33గా ఉంది.నిఫ్టీ సూచీలో ట్రెంట్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ షేర్లు రాణించాయి. హిందాల్కో, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి.

కారణాలివే..

నేటి ట్రేడింగ్‌లో నష్టాలకు ప్రధాన కారణం లోహరంగ షేర్లు. అవి రెండు శాతం మేర కుంగాయి. డాలర్ బలపడటంతో కమోడిటీ ధరలు పెరగడం, గత మూడు సెషన్లలో దూసుకెళ్లిన మెటల్ ఇండెక్స్‌లో కరెక్షన్ చోటుచేసుకోవడం నష్టాలకు కారణం. మరోవైపు, ఆసియా మార్కెట్లలోని దక్షిణకొరియా కొస్పి మూడుశాతం పతనమైంది. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. బుధవారం సాయంత్రం అమెరికా మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి.

తొలి యమహా ఈవీ స్కూటర్..

న్యూఢిల్లీ:ప్రముఖ ద్విచక్ర వాహనాల సంస్థ యమహా మోటార్ ఇండియా తన తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ ఈసీ-06ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ. 1,67,600(ఎక్స్ షోరూం)గా కంపెనీ ప్రకటించింది. విద్యుత్ మొబిలిటీ సెగ్మెంట్ రంగంలో అడుగు పెట్టాలనే ఉద్దేశంతో ఈసీ-06ను లాంచ్ చేసింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 169 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. ఎంపిక చేసిన నగరాల్లో యమహా బ్లూ స్క్వేర్ ప్రీమియం షోరూంలలో ఈ స్కూటర్లను విక్రయించనున్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తాము కట్టుబడి ఉన్నామని, ఇందులో భాగంగా ఈసీ-06ని లాంచ్ చేసినట్లు యమహా మోటార్ ఇండియా చైర్మన్ హజీమే అయోటా పేర్కొన్నారు.

ఉద్యోగులకు కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్..

100శాతం బోనస్

న్యూఢిల్లీ:ప్రముఖ ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తమ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025 సంవత్సరానికి గానూ 100శాతం బోనస్ ప్రకటించింది. రెండేళ్లకు ముందే కంపెనీ తన లక్ష్యాలను చేరినందుకు గానూ ఈ బోనస్ చెల్లింపులు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవికుమార్ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు.“ఉద్యోగుల క్రమశిక్షణ, పనితీరు, కాగ్నిజెంట్‌పై మన క్లయింట్ల నిబద్ధతకు 2025లో కంపెనీ సాధించిన ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఉద్యోగుల కృషికి గుర్తింపుగా.. 100శాతం బోనస్ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తాం” అని రవికుమార్ తన సందేశంలో తెలిపారు. ఆదాయ వృద్ధి, లాభాలు వంటి అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన అగ్ర శ్రేణి సంస్థల జాబితాలో కాగ్నిజెంట్ చేరింది. ‘విన్నర్స్ సర్కిల్’గా అభివర్ణించే ఈ జాబితాలో 2027 నాటికి చేరాలని కాగ్నిజెంట్ లక్ష్యంగా పెట్టుకోగా.. 2025లోనే కంపెనీ దాన్ని సాధించగలిగింది. 2025 మొత్తానికి కాగ్నిజెంట్ ఆదాయం 7% పెరిగి 21.10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.90 లక్షల కోట్లకు చేరింది. జనవరి-డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా ఈ కంపెనీ పరిగణిస్తుంటుంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 3.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెజార్టీ ఉద్యోగులు భారత్‌లోనే పని చేస్తున్నారు.

ఎఫ్‌అండ్‌ఓ సట్టా మార్కెట్ లాంటిది..

అందుకే ట్యాక్స్ పెంపు: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ:ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ పెంచుతూ ఇటీవల కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీంతో ఆ రోజు స్టాక్‌మార్కెట్ తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. మార్కెట్ ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న వేళ ఎస్‌టీటీ పెంచడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అయితే, ఈ పెంపు నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించుకున్నారు. ఎఫ్‌అండ్‌ఓ ట్రేడింగ్ అనేది సట్టా మార్కెట్ లాంటిదని, అందుకే ఎస్‌టీటీ పెంచాల్సి వచ్చిందన్నారు. ఈ మేరకు ‘ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు.“ఎఫ్‌అండ్‌ఓ ట్రేడింగ్ అనేది సట్టా మార్కెట్ (అధిక రిస్క్‌తో కూడిన ట్రేడింగ్. ఓ విధంగా జూదం) లాటిది. ఇక్కడ చాలామంది నష్టపోతున్నారు. ఈ స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌లో పాల్గొని 90 శాతం మంది వరకు చేతులు కాల్చుకున్నారు. అందుకే ఎస్‌టీటీ పెంచాల్సి వచ్చింది. అందుకే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌కు సంబంధించి మాత్రమే ఎస్‌టీటీ పెంచాం. మిగిలిన వాటి జోలికి వెళ్లలేదు” అని నిర్మలా సీతారామన్ అన్నారు.ఈక్విటీలపై వచ్చే ఆదాయంపై క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పెంచే ఉద్దేశమేదీ లేదని ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. నిజాయతీగా పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించేవారిని నిరాశపరిచే ఉద్దేశమేదీ లేదన్నారు. ఈక్విటీలపై పన్ను విధించే ఆలోచన ఏదీ లేదని పునరుద్ఘాటించారు. చాలామంది ప్రజలు బ్యాంకులు, పోస్టాఫీసుల్లోని తమ సేవింగ్స్‌ను స్టాక్ మార్కెట్‌లో పెట్టుడులుగా పెట్టడం శుభపరిణామమని పేర్కొన్నారు. రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని, భారీ హెచ్చుతగ్గులు ఉంటేనే ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందని నిర్మలా సీతారామన్ అన్నారు.

నచ్చిన రీల్స్ ఇన్‌స్టాలో కావాలా?

అల్గారిథమ్ రీసెట్ చేయండిలా..

న్యూఢిల్లీ:ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ఫీచర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చిన్న పిల్లలు మొదలుకొని పెద్దవారి వరకు అందరూ ఆసక్తిగా చూస్తుంటారు. ఒక్కోసారి రీల్స్ చూస్తూ కూర్చుంటే గంటలు కూడా గడిచిపోతుంటాయి. రీల్స్ చూసే వారిలో చాలా మందికి ఓ సమస్య ఎదురవుతుంటుంది. ఇంట్లో ఉండే చిన్న పిల్లలు గానీ, పెద్దవాళ్లు గానీ మన ఫోన్ వాడితే మనం రీల్స్ చూసేటప్పుడు మనకు నచ్చిన కంటెంట్ కాకుండా వేరే కంటెంట్ రీల్స్‌లో దర్శనమిస్తుంటుంది. అలా కాకుండా మీకు నచ్చిన కంటెంట్ మాత్రమే చూపించేందుకు ఒక మార్గం ఉంది.. అదే అల్గారిథమ్ రీసెట్. ఇంతకీ ఏంటిది? ఎలా చేయాలి?మనం ఇన్‌స్టాలో చూసే కంటెంట్ ఆధారంగా అల్గారిథమ్ మనకు కంటెంట్‌ను చూపిస్తుంటుంది. మన ఆసక్తులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందుకు అనుగుణంగానే ఫీడ్ దర్శనమిస్తుంటుంది. సినిమా, స్పోర్ట్స్, ఆధ్యాత్మికం ఇలా.. వ్యక్తుల ఇష్టాయిష్టాలను బట్టి రీల్స్ వస్తుంటాయి. సింపుల్‌గా చెప్పాలంటే మీ ఇష్టాలను నోట్ చేసుకుని మీకు నచ్చినట్లుగా ఇన్‌స్టా వ్యవహరిస్తుంటుంది. దీన్ని కావాలంటే రీసెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఫీడ్‌లో కంటెంట్ చూపించే విషయంలో మార్పులు వస్తాయి.



ఎల్ఐసీ లాభం రూ.12,958 కోట్లు

న్యూఢిల్లీ:ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ త్రైమాసిక ఫలితాలను గురువారం ప్రకటించింది. 2025 డిసెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.12,958 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదుచేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.11,057 కోట్ల నికర లాభంతో పోలిస్తే 17 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ప్రీమియంల ద్వారా వచ్చే ఆదాయం రూ.1,25,613 కోట్లుగా ఉంది. గతేడాది త్రైమాసికంలో ఈ మొత్తం రూ.1,06,891 కోట్లుగా ఉందని ఎల్ఐసీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ.2,01,994 కోట్ల నుంచి రూ.2,33,984 కోట్లకు పెరిగింది. ఒక్క మూడో త్రైమాసికంలో కమీషన్ కింద ఏజెంట్లకు రూ.6011 కోట్లు చెల్లించింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.5,966 కోట్లుగా ఉంది. అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో తొలి ప్రీమియం వసూళ్ల కింద రూ.10,605 కోట్లు వచ్చినట్లు కంపెనీ తెలిపింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.7,285 కోట్లుగా ఉంది. త్రైమాసిక ఫలితాల వేళ కంపెనీ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్‌లో షేరు విలువ 0.56 శాతం లాభంతో రూ.840 వద్ద స్థిరపడింది.

ఐటీ కంపెనీల ‘బిల్లబుల్ అవర్స్’కు పొంచిఉన్న ముప్పు

న్యూఢిల్లీ:ఇప్పటివరకు కృత్రిమమేధ (ఏఐ) టూల్స్ అంటే ఉద్యోగులకు సహాయం చేసే సాఫ్ట్‌వేర్‌గా పరిగణిస్తున్నారు. కానీ తాము రూపొందించిన కొత్త ఏఐ టూల్, మానవ ప్రమేయం లేకుండానే, క్లిష్టమైన ఆఫీసు పనులను స్వతంత్రంగా పూర్తి చేస్తుందంటూ అమెరికాకు చెందిన ‘ఆంత్రోపిక్’ అనే సంస్థ చేసిన ప్రకటన, ప్రపంచ టెక్నాలజీ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫలితంగా అంతర్జాతీయంగా, మనదేశంలోనూ ఐటీ కంపెనీల షేర్లు పతనమయ్యాయి. కొవిడ్ పరిణామాల నాటి 2020 మార్చి తర్వాత, ఐటీ కంపెనీల షేర్లు ఇంతగా నష్టపోవడం ఇప్పుడే. ప్రస్తుతం మదుపరులే కాదు.. అందరిలో తలెత్తుతున్న ప్రశ్న.. ‘భవిష్యత్తులో కంపెనీలకు నిజంగా మానవ వనరుల అవసరం ఉండదా?’ అనే.అమెరికాకు చెందిన ఏఐ అంకురం.. ఆంత్రోపిక్ తన ప్లాట్‌ఫామ్‌ను విస్తరిస్తూ.. క్లాడ్ కోవర్క్‌ను జనవరి చివరివారంలో ఆవిష్కరించింది. వివిధ రంగాల్లోని పనులను నిర్వహించేందుకు వీలుగా 11 కొత్త ప్లగిన్‌లను విడుదల చేసింది. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని, పనులు నిర్వహిస్తాయన్నమాట. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్.. చాట్‌జీపీటీ, జెమినై, గ్రోక్..వంటివన్నీ తెలివైన విద్యార్థుల వంటివి. మనం వాటిని ఏం అడిగితే, దానికి మాత్రమే సమాధానం ఇస్తాయి. కంటెంట్ రాయమంటే, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా రాస్తాయి. కానీ, వాటికి మనమే మార్గనిర్దేశం చేయాల్సి ఉంటుంది. క్లాడ్ కోవర్క్ అలా కాదు.. ఇది పనులు ఎలా పూర్తి చేయాలో తెలిసిన ఒక అనుభవజ్ఞుడైన ఆఫీసు ఉద్యోగిలా ప్రవర్తిస్తుంది. ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమే కాదు, నేరుగా రంగంలోకి దిగి, పనులను పూర్తి చేస్తుంది. ఒక్కమాటలో.. క్లాడ్ కోవర్క్ అనేది ఒక పూర్తిస్థాయి డిజిటల్ ఉద్యోగి అని చెప్పొచ్చు. క్లాడ్ కోవర్క్ స్వయంగా కంప్యూటర్ ఫోల్డర్లను తెరచి, అందులోని పత్రాలను చదివి, కావాల్సిన సరైన ఫైల్‌ను వెతికి పట్టుకోగలదు. అందులో మార్పులు చేసి, వాటన్నింటినీ క్రమ పద్ధతిలో ఆర్గనైజ్ చేయగలదు. 11 ప్లగిన్‌ల సాయంతో ఇది న్యాయవాది, మార్కెటింగ్ - ఆర్థిక నిపుణులు, డేటా అనలిస్ట్ లేదా పరిశోధకుడిగా తన పాత్రను మార్చుకుని, పనిచేయగలదని కంపెనీ చెబుతోంది. దీనికి ప్రతి చిన్న విషయాన్నీ వివరించాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు ఈ 50 కాంట్రాక్టులను పరిశీలించి, వచ్చే నెలలో గడువు ముగిసే వాటి వివరాలు ఇవ్వు అని చెబితే చాలు. ఆ పనిని మొత్తం స్వయంగా పూర్తి చేసేస్తుందట.మన ఐటీ కంపెనీల ఆదాయంలో సింహభాగం అమెరికా, ఐరోపా దేశాల సంస్థల నుంచే వస్తుంది. అక్కడి వాణిజ్య సంస్థల కోసం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, నిర్వహణ సేవలను మన ఐటీ కంపెనీలు అందిస్తాయి. ఇందుకోసం భారీగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నియమించుకుంటున్నాయి. ఆంత్రోపిక్ టూల్స్ వల్ల ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మన ఐటీ కంపెనీల బిల్లింగ్ ‘లేబర్ బేస్డ్ మోడల్’పై ఉంటుంది. ఒక ప్రాజెక్టు కోసం ఎంతమంది ఇంజినీర్లు, ఎన్ని గంటలు పనిచేశారు అనే లెక్కన క్లయింట్లు డబ్బు చెల్లిస్తారు. దీన్నే ‘బిల్లబుల్ హవర్స్’ అంటారు. క్లాడ్ వంటి ఏఐ టూల్స్ కోడింగ్, టెస్టింగ్‌లాంటి పనులను ఎంతో వేగంగా చేసేస్తున్నాయి. పది మంది చేసే పనిని, ఏఐ సాయంతో ఒకే ఇంజినీర్ చేయగలిగితే.. క్లయింట్లు ఇచ్చే డబ్బులు తగ్గిపోతాయి. ఇది మన ఐటీ కంపెనీల వ్యాపార లావాదేవీల పరిమాణాన్ని, మార్జిన్లను దెబ్బతీసే ప్రమాదముంది. ఇంతేకాదు.. ఐటీ ఉద్యోగ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపొచ్చు. గ్లోబల్ టెక్ కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ఏఐని వేగంగా స్వీకరిస్తున్నాయి. అవి ఔట్ సోర్సింగ్ తగ్గిస్తే, విదేశీ క్లయింట్లపైనే ఎక్కువగా ఆధారపడిన భారతీయ ఐటీ సంస్థలు ఇబ్బందుల్లో పడతాయి.సంప్రదాయ కోడింగ్, టెస్టింగ్ చేసే వారికంటే భవిష్యత్తులో కన్సల్టింగ్, ప్లాట్‌ఫామ్ ఆధారిత పరిష్కారాలు, అధిక విలువ కలిగిన పనులు చేసే ఉద్యోగులకే గిరాకీ అధికంగా ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భవిష్యత్తును అంచనా వేసే, స్టాక్ మార్కెట్లలో మదుపర్లు లావాదేవీలు నిర్వహిస్తుంటారు. బుధవారం ఐటీ షేర్ల పతనం ఏఐ ఆందోళనల ఫలితమే. మానవ వనరుల ఆధారిత ఐటీ కంపెనీల వ్యాపార నమూనాలు, ఎంతకాలం నిలకడగా ఉంటాయనే దానిపై అనిశ్చితి వల్లే, ఈ షేర్లను విక్రయించారు. కొన్నేళ్లలో సాంకేతిక మార్పులు మరింత వేగం పుంజుకుంటాయని.. దానికి అనుగుణంగా కంపెనీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ఆంత్రోపిక్ విడుదల చేసిన ప్లగిన్‌లు.. గతంలో వ్యక్తులు లేదా ప్రత్యేక సాఫ్ట్‌వేర్లు చేసే పనులను చిటికెలో చేసేస్తాయని చెబుతున్నారు. వాటిలో లీగల్ ప్లగిన్: ఇది కాంట్రాక్టులను పరిశీలించడం, వాటిలో ఎన్‌డీఏ (రహస్య ఒప్పందాల)ను క్రమబద్ధీకరించడం, నష్టాలను గుర్తించడం, చట్టపరమైన నిబంధనలను సరిచూడటం వంటివి చేస్తుంది. ఈ ప్లగిన్ సామర్థ్యం బయటపడగానే లీగల్ టెక్నాలజీ కంపెనీలైన థామ్సన్ రాయిటర్స్, లీగల్ జూమ్ వంటి షేర్లు 15-20% పడిపోయాయి. ఫైనాన్స్ ప్లగిన్: అకౌంటింగ్ వివరాలను నమోదు చేయడం, ఖాతాల పరిశీలన, ఆర్థిక నివేదికలను సిద్ధం చేయడం వంటి పనులను నిర్వహిస్తుంది. డేటా అనాలసిసస్: డేటాబేస్‌ల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు అవసరమైన ఎస్‌క్యూఎల్ క్వెరీలను రాయడం, ఆ డేటా తీసుకుని, అందమైన డాష్‌బోర్డులుగా మార్చడం దీని పని. బయో రీసెర్చ్: ల్యాబ్ డేటాకు అనుసంధానమై, శాస్త్రీయ పరిశోధనల ప్రారంభ దశలో కీలక సాయాన్ని అందిస్తుంది. ఇలా ఈ ప్లగిన్‌లు నిపుణులు, ఖరీదైన సాఫ్ట్‌వేర్లు, ఔట్ సోర్సింగ్ బృందాలు చేసే పనులను భర్తీ చేస్తాయని అంటున్నారు.

ఏఐతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు గల్లంతు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఎంట్రీలెవల్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని మార్కెట్ నిపుణుడు, ప్రముఖ మదుపరి రమేశ్ దమానీ అన్నారు. ఐఐటీలు, ఇతర టెక్ ఇన్‌స్టిట్యూట్లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో వచ్చే ‘ఈజీ జాబ్స్’ పోతాయని పేర్కొ?న్నారు. గతంలో సులభంగా దొరికిన జాబ్స్ భవిష్యత్తులో లభించకపోవచ్చన్నారు. ఆంత్రోపిక్ సహా పలు ఏఐ సంస్థల రాకతో ఐటీ రంగంలో అలజడి నెలకొన్న నేపథ్యంలో ఆయన ‘ఎన్డీటీవీ ప్రాఫిట్’తో మాట్లాడారు.వల్ల ఏజెంటిక్ ంఎ వంటి అభివృద్ధి రావడంతో ఈ మార్పు త్వరగా జరుగుతుందని రమేశ్ దమానీ అన్నారు. అలాగని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొత్త ఉద్యోగావకాశాలకు ఢోకా ఉండబోదన్నారు. కొత్తగా ఉద్యోగ సృష్టి జరుగుతుందని, భవిష్యత్‌లో మాత్రం ఐటీ రంగానికి వచ్చే ఇబ్బందేమీ ఉండబోదని పేర్కొన్నారు. యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్ అనే జాబ్ ఒకటి ఉంటుందని 80ల్లో ఎవరూ ఊహించి ఉండరని పేర్కొన్నారు. అదే మాదిరిగా ఏఐ కూడా కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చెప్పుకొచ్చారు.భారత్‌లోని టాప్-7 సాఫ్ట్‌వేర్ కంపెనీల మొత్తం విలువ 350 బిలియన్ డాలర్లు కాగా.. ఏఐ కంపెనీ ఆంత్రోపిక్ ఒక్క దాని విలువే 350 బిలియన్ డాలర్లు అని దమానీ పేర్కొన్నారు. ఆయా ఐటీ కంపెనీల్లో మొత్తం 16 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఆంత్రోపిక్‌లో కేవలం 2 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. ఏఐ కారణంగా పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకునేందుకు గతేడాది ఉద్యోగులను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. 2025లో సుమారు 55 వేల మంది ఉద్యోగాలు

ఒక్క రోజే రూ.30వేలు తగ్గిన వెండి ధర..

కాస్త దిగొచ్చిన పసిడి

న్యూఢిల్లీ:దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం దిగొచ్చాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.6,600 తగ్గి రూ.1,59,680 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,550గా ఉంది. ఇక, వెండి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.30వేల మేర తగ్గింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,69,000గా ఉంది. అంతర్జాతీయంగానూ ఈ లోహాల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పుత్తడి ధర 4,919 డాలర్లు, ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు వెండి దాదాపు 7శాతం కుంగి కిలో ధర రూ.2.49 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.53 లక్షలకు చేరింది.

ఇంధన భద్రతకే అధికప్రాధాన్యం

కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం” అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్‌వాల్ ఓ మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం దేశ ఎగుమతులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, వృద్ధి, ప్రజల సంక్షేమానికి ఊతమిస్తుందని తెలిపారు. మరోవైపు.. ఇటీవలి ఇరాన్ ఆందోళనల సమయంలో అక్కడ ఉన్న భారతీయులు మృతి చెందినట్లు, తప్పిపోయినట్లు నివేదికలేవీ లేవని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్లమెంటుకు తెలిపింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక భారత పౌరులతో నిత్యం సంప్రదింపుల్లో ఉందని విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. తాజా అంచనాల ప్రకారం.. ఆ దేశంలో దాదాపు 10 వేలమంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు చెప్పారు.

నేను పశ్చాత్తాపం వ్యక్తంచేస్తున్నా

: ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్



న్యూఢిల్లీ:ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ వ్యవహారంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కు సంబంధించిన పలు విషయాలు వెల్లడయ్యాయి. దీనిపై తాజాగా గేట్స్ స్పందించారు. అతడితో ఉన్న ప్రతీ క్షణానికి చింతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియా సంస్థతో మాట్లాడారు. “ఎప్‌స్టీన్ కోసం కేటాయించిన ప్రతీ క్షణానికి ఇప్పుడు నేను చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. అయితే ఆ ఈ-మెయిల్‌లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదోఒక రూపంలో అతడు నన్ను టార్గెట్ చేయాలని ప్రయత్నించాడా..?” అని వ్యాఖ్యలు చేశారు. ఆ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీల (ఇజూబబివతిని టతిశ్రీవబ)ను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో గేట్స్‌కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారినపడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్లే బిల్‌గేట్స్‌తో బంధం ముగిసింది: మిలిందా

2013లో తనకి తాను రాసుకున్న ఈ-మెయిల్‌లో అతడు ఈ విషయాలు ప్రస్తావించాడు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన మిలిందా (గేట్స్ మాజీ భార్య)కు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్‌ను అడిగారని రాసుకొచ్చాడు. ఆ పరిణామాల తర్వాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఎప్‌స్టీన్ వెల్లడించాడు.అయితే ఈ-మెయిల్‌లోని అంశాలను గేట్స్ బృందం ఖండించింది. ఇదిలాఉంటే.. ఈ ఫైళ్ల విడుదల తర్వాత మిలిందా స్పందించిన సంగతి తెలిసిందే. “నా వివాహంలో ఎంతో బాధించే కొన్ని విషయాలు ఉన్నాయి. ఇప్పుడు బయటకు వచ్చిన వాటిపై సమాధానం ఇవ్వాల్సింది బిల్‌గేట్స్.. నేను కాదు. బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నా” అని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్ - మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. ఎప్‌స్టీన్‌తో గేట్స్‌కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి.

గోదావరి పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- పుష్కరాల స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మంథని, (జనంసాక్షి) : పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం ఆయన అంతర్గాం మండలంలోని గోలివాడ, రామగుండం, గోదావరిఖని సమ్మక్క సారలమ్మ టెంపుల్, రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్, మంథని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని, పుష్కర ఘాట్లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల భక్తులు వస్తారనే అంచనా తో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట, ఘాట్ నిర్మాణం పనులు ఉన్నాయని,స్థలం ఏర్పాటు మొదలగు పనులు రోజుకు లక్ష భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తు పనులు, బ్యారెజీ వద్ద రోడ్డు డబుల్ లైన్ చేయాలన్నారు. మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని , ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్, ఔట్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ లు బి.గంగయ్య, సురేష్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఇ.వై.టీం. తః రీ ఖాన్, జైదీప్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తెస్తా

- మా చొరవతోనే పంచాయతీలకు రూ.259 కోట్లు విడుదల
- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు గాడిదగుడ్డే
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు వరదలా నిధులు
- చైర్మన్ పీఠం బీజేపీకి అప్పగిస్తే హుజూరాబాద్‌లో స్టేడియం నిర్మాణం నా బాధ్యత : బండి సంజయ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్ల నిధులు తీసుకొస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. గురు వారం హుజూరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం తాజాగా రూ.259 కోట్లు విడుదల చేసిందని, తాను, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతోనే ఈ నిధులు వచ్చాయని బండి సంజయ్ తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఏమీ ఇవ్వలేదని, గాడిదగుడ్డు మాత్రమే ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాదిరిగా దొంగ హామీలు ఇవ్వమని, మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠం బీజేపీకి అప్పగిస్తే ఢిల్లీ నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి పట్టణ రూపురేఖలు మారు స్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ లకు కేంద్రం ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు ఇచ్చిందని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు వరదలా నిధులు తీసుకొస్తానని చెప్పారు.

మినీ స్టేడియం నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని ఆయన ఆరోపించా రు. ఎన్నికల అనంతరం వెంటనే స్టేడియం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని, ఎవరు అడ్డుపడినా చూసుకుంటానని హెచ్చరించారు. అర్థాంతరంగా నిలిచిన మినీ ట్యాంక్‌బండ్ పనుల ను పూర్తి చేస్తానని, సీఎస్ఆర్, ఎంపీ లాడ్స్ నిధులతో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలతో బుక్‌లెట్ ముద్రించి ఇంటింటా పంచుతున్నట్లు బండి సంజయ్ తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.19.57 కోట్లు, స్వచ్ఛ భారత్ ద్వారా రూ.1.10 కోట్లు, అమృత్ ద్వారా రూ.16.25 కోట్లు, స్వనిధి ద్వారా 4,377 మందికి రూ.7.63 కోట్లు, యూఐడీఎఫ్ ద్వారా రూ.36 కోట్లు విడుదలైనట్లు వివరించారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ, స్మశానవాటికల నిర్మాణం వంటి అన్ని పనులూ కేంద్ర నిధులతోనే జరిగాయని చెప్పారు. ఆసుపత్రికి మెడికల్ ఎక్విప్‌మెంట్, కమ్యూనిటీ హాల్స్, బోర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు, పరీక్ష ఫీజు చెల్లింపు వంటివి తన వ్యక్తిగత చొరవతో జరిగాయని బండి సంజయ్ పేర్కొన్నారు. నిరుపేదలకు ఇళ్ల మంజూరు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తానని, హుజూరాబాద్‌ను సుందర పట్టణంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. 100 పడకల ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపు హామీలు నమ్మి ప్రజలు మోసపోయారని, మహిళలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ, అవ్వాతాతలకు రూ.4 వేలు, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని బండి సంజయ్ విమర్శించారు. మంచి పాలన కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వండి

- పెద్దపల్లి పట్టణాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతాం
- అభ్యర్థుల గెలుపుతో అభివృద్ధి శరవేగంగా సాగుతుంది
- కాంగ్రెస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు గుర్తుచేసిన ఎమ్మెల్యే విజయరమణరావు పిలుపు
- బీఆర్ఎస్, బీజేపీ మాయమాటలకు మోసపోవద్దు

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 జనంసాక్షి : పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని శాసనసభ్యుడు చింతకుంట విజయరమణరావు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 28వ వార్డు సుభాష్‌నగర్‌లో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి తూముల లత సుభాష్‌రావు, 27వ వార్డు ఉనుకొండ సరస్వతి, 6వ వార్డు కట్ట పద్మావతి నరేందర్ చారి, 7వ వార్డు భూంనగర్‌లో ఈర్ల స్వరూప సురేందర్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పెద్దపల్లి పట్టణంలో అన్ని వార్డుల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ దిశగా అడుగులు వేస్తున్నామని విజయరమణరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, జీరో వడ్డీ రుణాలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, ఉచిత సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా దూసుకెళ్తున్నాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలు, రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓట్ల కోసం మాయమాటలు చెబుతారని, ప్రజలు వారిని తరిమికొట్టాలని హెచ్చరించారు.

అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను కౌన్సిల్‌కు పంపితే పెద్దపల్లి పట్టణాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

- 49 వార్డుల్లోనూ విజయం సాధించడమే లక్ష్యం : షబ్బీర్ అలీ
- పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో విడుదల
- గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి స్వస్తి పలికి అద్భుత మౌలిక సదుపాయాలు
- ప్రచార పర్యటనలో షబ్బీర్ అలీకి మహిళలు, యువత ఘన స్వాగతం

కామారెడ్డి, ఫిబ్రవరి 5 జనంసాక్షి : మున్సిపల్ ఎన్నికల్లో కామారెడ్డి పట్టణంపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ప్రభుత్వ సలహాదారు మహ మ్మద్ అలీ షబ్బీర్ ధీమా వ్యక్తం చేశారు. సిరి సిల్ల రోడ్డులోని కింగ్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఎన్నికల వ్యూహరచన సదస్సులో ముఖ్య అతిథి గా హాజరైన ఆయన 49 వార్డుల అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేశారు. అభివృద్ధే కాంగ్రెస్ నినాదమని, మంత్రంతోనే ప్రజల ముందుకు వెళ్తున్నామని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. రెండేళ్లుగా ప్రజలకు కనిపించని ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేతలు ఇప్పుడు కరప్షన్ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములను అరోరా కాలేజీకి ఇచ్చింది ఎవరని, కాంగ్రెస్ ఎమ్మెల్సీ టికెట్ అమ్మింది ఎవరని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో పట్టణం ఎదుర్కొన్న నిర్లక్ష్యానికి స్వస్తి పలికి అద్భుత మౌలిక సదుపాయాలతో రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల పరిష్కారాన్ని వివరించాలని అభ్యర్థులను కోరారు. క్రమశిక్షణ, ఐక్యతతో పనిచేసి 49 వార్డుల్లోనూ విజయం సాధించాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో అంతర్గత రహదారుల విస్తరణ, అత్యాధునిక డ్రైనేజీ, మిషన్ భగీరథ ద్వారా నిరంతరాయ శుద్ధ త్రాగునీరు, ఆసుపత్రుల ఆధునికీకరణ, అమ్మ మోడల్ స్కూల్స్ వంటి అంశాలు ఉన్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. గత పదేళ్లు పట్టణాన్ని పట్టించుకోని వారు ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని, ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని విమర్శించారు.

అనంతరం 3, 4, 5, 8, 26, 29, 30, 31 వార్డుల్లో ప్రచారంలో పాల్గొన్న షబ్బీర్ అలీకి మహిళలు హారతులు, యువత గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అంద రూ వచ్చి అభివృద్ధి వాగ్దానాలు చేస్తారని, కానీ తాము చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడుగుతున్నామని ఆయన అన్నారు. రెండున్నర ఏళ్లు ముఖం చాటేసిన నాయకులు ఇప్పుడు కులమతాలు రెచ్చగొట్టి ఓట్లు దండు కోవాలని చూస్తున్నారని హెచ్చరించారు. మానవత్వమే మతమని, కామారెడ్డిని రాష్ట్రంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. తానే పూచీకత్తుగా ఉండి నిధులు తెచ్చి పనులు పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు. చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సదస్సులో మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస శ్రీనివాసరావు, డీపీసీసీ జనరల్ సెక్రటరీలు ఇంద్రకరణ్ రెడ్డి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, మాజీ చైర్మన్ ఇందుప్రియ, మండల అధ్యక్షులు అనంతరెడ్డి, సుతారి రమేష్, భీమ్ రెడ్డి, రమేష్ గౌడ్, గూడెం శ్రీనివాస్ రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు, 49 వార్డుల అభ్యర్థులు పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమాల్లోనూ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

ముస్తాబాద్ ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : ముసాద్ మండలంలో మిషన్ భగీరథ నీరు సరిగా సరపురం కావడం లేదని మండల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మిషన్ భగీరథ అధికా రులు సర్పంచ్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మిషన్ భగీరథ నీటి సరఫరా లో అధికారుల నిర్లక్ష్యంతోనే సరఫరాల అంతరాయం ఏర్పడుతుందని అన్నారు గతంలో అధికారులు మిషన్ భగీరథ పైప్ లైన్, ట్యాంక్ లో ఏర్పాట్లు నాణ్యత పాటించలేదని కొన్ని ట్యాంకులకు పాత ట్యాంకులకు రంగులు వేసి బిల్లులు పొందాలని కూడా సరిగా వేయలేదని అన్నారు నాసిరకం పైపులు వేయడంతో పైపులు పగులుతున్నాయని అన్నారు అధికారులు దీనిపై పూర్తి విచారణ జరిపి నీరు ప్రజలకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో మిషన్ భగీరథ డిపిఓ సేరిపోద్దిన్, ఈ, ఈ సుమలత, ఇట్ర డి ఈ పావని, రామ్, ఏ,ఈ దివ్య, ఎంపీడీవో లచ్చాలు, మిషన్ భగీరథ డియి పావని, రాము, ఏఈ దివ్య, సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ఎంపీఓ వహీద్, వివిధ గ్రామాల సర్పంచ్లు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో గోల్డెన్ తులిప్ బాంకెట్ హాల్ ప్రారంభం

- మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయరమణరావు చేతులమీదుగా రిబ్బన్ కట్
- ఆధునిక ఏసీ గదులు, లగ్జరీ సూట్స్, సెలబ్రేషన్ హాల్స్‌తో నిర్మాణం
- నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 జనంసాక్షి : పెద్దపల్లి పట్టణంలో కలెక్టరేట్ ముందు నూతనంగా నిర్మించిన గోల్డెన్ తులిప్ బాంకెట్ హాల్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నిర్వాహకులు రాజ్‌కు మార్ అగర్వాల్ ఆహ్వానంపై ఆయన ఇద్దరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఆధునిక సౌకర్యాలతో ఏసీ గదులు, లగ్జరీ సూట్స్, సెలబ్రేషన్ హాల్, కాన్ఫరెన్స్ హాల్ నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయరమణరావు నిర్వాహకులు రాజ్‌కు మార్ అగర్వాల్, కృష్ణ అగర్వాల్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు ముందుగా మంత్రి, ఎమ్మెల్యేలను స్వాగతం పలికి సన్మానం చేసి బొకేలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ వ్యాపారవేత్తలు, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొట్ల తిరుపతి యాదవ్, కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ఏసీపీ జి.కృష్ణ, సీఐలు కే.ప్రవీణ్, సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్, ఎస్సైలు లక్ష్మణ్ రావు, నరేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, సనత్ కుమార్, రూరల్ ఎస్సై మల్లేశం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. 23, 4 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఎమ్మెల్యే విజయరమణరావు ప్రచారం

గడపగడపకు తిరిగి ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్యే

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి మున్సిపాలిటీ 23, 4 వార్డుల్లో శాసనసభ్యుడు చింతకుంట విజయరమణరావు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు తిరిగారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థులు తాండూరి శ్రీమాన్ నారాయణ, కొమ్ము సుధాకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సందన వేణి సునీత-రాజేందర్ యాదవ్, కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కనగర్తి సర్పంచ్ పెద్దెల్లి శ్రీదేవి శంకర్, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు, కార్యకర్తలు, వార్డు ఇంచార్జులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి భరించలేక.. ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య

హైదరాబాద్ : పని ఒత్తిడిని భరించలేక ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణానికి పాల్పడ్డా డు. ఈ ఘటన మియాపూర్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలిలోని ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సతీశ్ (31)మియాపూర్‌లోని ఇంట్లో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. సతీశ్‌కు ఏడాది క్రితమే వివాహం కాగా.. సంక్రాంతికి అతడి భార్య ఊరెళ్లింది. అయితే సతీశ్ ఏంతకీ గదిలో నుంచి బయటకు రాకపోవడంతో అతని తమ్ముడు తలుపులు పగులగొట్టాడు. లోపలికి వెళ్లేసరికి సతీశ్ చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. సతీశ్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సతీశ్ స్వస్థలం ఏపీలోని అమలాపురంలో తిల్లకుప్ప. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కార్మికులే సింగరేణి సంస్థకు మూలస్తంభాలు

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి ఆర్ జీవన్ ఏరియాలోని ఓసి ఫైవ్‌లో గురువారం నిర్వహించిన కార్మికుల ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి కార్మికులను ఆత్మీయంగా పలకరించి, వారి క్షేమం, పనివాతావరణం, సంక్షేమ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులే సంస్థకు మూలస్తంభాలని పేర్కొన్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్య లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్ష

నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 5 జనంసాక్షి : అభివృద్ధి పనుల ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, జిల్లా అధికారులతో, సీఎంఓ కార్యాలయం నుంచి హాజరైన భద్రతా విభాగం అధికారులతో కలిసి గురువారం తుది ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

డిచ్పల్లి మండలం బర్దీపూర్ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ తదితర ప్రాంతాలను నిశితంగా పరిశీలన చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు సీఎం కాన్వాయ్‌కు ఎలాంటి అడ్డంకులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. బహిరంగ సభకు వచ్చే వారి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఎంపిక చేసిన ప్రదేశంలోనే వాహనాలు నిలిపేలా చూడాలన్నారు. సీఎం సభకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, సభకు హాజరయ్యే వారికి తాగునీరు వంటి వసతులు కల్పిస్తూ, ప్రథమ చికిత్స సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీ.ఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోలీసు అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని అన్నారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, సీఎంఓ కార్యాలయ భద్రతా అధికారి మాధవరావు, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, ప్రకాష్, మస్తాన్ అలీ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 5 (జనం సాక్షి) : రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావ ళికి అనుగుణంగాఅధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా.. నిజాయితీగా ఎంతో జాగరూకతతో నిర్వర్తించాల ని ఆదేశించారు. నియమ, నిబంధనల స్పష్టమైన అవగాహన ఉండాలని, ఎస్ఈసీ హ్యాండ్ బుక్ వెంట ఉండాలని సూచించారు. ఎస్ఈసీ మార్గదర్శ కాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని వివరించారు.

సిరిసిల్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని సూచించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్ లు చెక్ చేసుకొని తీసుకువెళ్లాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్స్, ఎన్నికల అధికారులు మినహా ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రి అంతా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిర్ లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి అప్పగించాలని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.

ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి కనీస వసతులు, భోజనం ఇతర సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ నివారణపై బాలికలకు అవగాహన కార్యక్రమం

- ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, న్యాయ సేవల ఆధ్వర్యం
- బ్రెస్ట్ స్క్రీనింగ్, వ్యాయామం నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి: ప్రధాన జడ్జి సునీత
- పొగాకు, మద్యం మాని టీకాలు వేయించుకోవాలి: డీఎంహెచ్ఓ ప్రమోద్ కుమార్
- రామగుండంలో 10 పడకల క్యాన్సర్ కేర్ వార్డు ఏర్పాటు

పెద్దపల్లి, ఫిబ్రవరి 05 (జనంసాక్షి) : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రధాన జిల్లా న్యాయమూర్తి కుంచాల సునీత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ప్రమోద్ కుమార్ హాజరయ్యారు. ప్రధాన జిల్లా న్యాయమూర్తి కుంచాల సునీత మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ చర్యలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, వాటిని ఆచరించి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. బాలికలకు సానిటరీ నాప్‌కిన్లు అందించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. బాలికలు, మహిళలు ప్రతినెల స్వయంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ చేసుకోవాలని, అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు. శారీరక వ్యాయామం, యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు, మద్యం సేవించడం మానుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని, హెపటైటిస్-బి, హెచ్‌పీవీ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో మొదటిసారి కీమోథెరపీ చేయించుకున్న రోగులకు తదుపరి చికిత్స అందించేందుకు రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 10 పడకల క్యాన్సర్ కేర్ ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రోగ్రాం అధికారి డా. ఆర్. రాజమౌళి జిల్లాలో క్యాన్సర్ నివారణకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరిం చారు. వైద్య అధికారి డా. లక్ష్మీ భవాని మాట్లాడుతూ అకస్మాత్తుగా బరువు తగ్గడం, తగ్గని దగ్గు, కంఠం పెరగడం, గడ్డలు పెరగడం, దగ్గు లేదా విసర్జన సమయంలో రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. కె. రాజమౌళి, వైద్య అధికారులు డా. లక్ష్మీ భవాని, డా. సంయుక్త, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్. శ్రీనివాస్, ఎం. బాలకృష్ణ, కె. సంకీర్తన, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి భాగ్యలక్ష్మి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు మధుసూదన్, టి. రాజేష్, కె. రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్ఎల్‌హెచ్‌పీలకు సమీక్ష సమావేశం

జిల్లాలో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎమ్ఎల్ హెచ్‌పీ)కు జిల్లా అధికారుల కార్యాలయ సముదాయ భవనం (ఐడీఓసీ) మినీ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ప్రమోద్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎమ్ఎల్‌హెచ్‌పీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ నెలవారీ లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని సూచించారు. అమలైన కార్యక్రమాల వివరాలను సంబంధిత వెబ్ సైట్లలో సమయానుకూలంగా నమోదు చేయాలని, రిజిస్టర్లు సక్ర మంగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో సమయపాలన పాటించాలని తెలిపారు. తదుపరి వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సంబంధిత ప్రోగ్రాం అధికారులు సమీక్ష నిర్వహించి పలు సూచనలు, మార్గదర్శ కాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. వి. వాణిశ్రీ, డా. ఆర్. రాజమౌళి, డా. బి. శ్రీరాములు, డా. కె.వి. సుధాకర్ రెడ్డి, డా. బి. కిరణ్ కుమార్, వైద్య అధికారి డా. లక్ష్మీ భవాని, డి.పి.ఓ. ఉమా దేవి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎ. మధుసూదన్, జిల్లా డేటా మేనేజర్ మహేందర్ పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలి

- అంగన్వాడీ కేంద్రాలు నిబంధనల ప్రకారం పనిచేయాలి
- 90 కేంద్రాల మరమ్మతులకు రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరు
- ఆహార పదార్థాల నాణ్యత రెగ్యులర్‌గా చెక్ చేయాలి : కలెక్టర్ శ్రీహర్ష
- సూపర్‌వైజర్లు, టీచర్ల పనితీరును ప్రతివారం పరిశీలన

పెద్దపల్లి, ఫిబ్రవరి 05 (జనంసాక్షి) : పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన ఈ మేరకు సూచనలు జారీ చేశారు.

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు నిబంధనల ప్రకారం పనిచేసేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూపర్‌వైజర్లను ఆదేశించారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 90 అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులకు కేంద్రం వంద రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎదుగుదలను ప్రతినెలా మానిటరింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి ఒక పూట భోజనం తీసుకునేలా చూడాలని ఆదేశించారు. పాలు, కోడిగుడ్లు, పప్పుదినుసులు, ఇతర ఆహార పదార్థాలను సరిగ్గా నిల్వ చేయాలని సూచించారు. అందించే ఆహార పదార్థాల నాణ్యతను రెగ్యులర్‌గా చెక్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో పాడైనవి పిల్లలకు లేదా గర్భిణులకు ఇవ్వరాదని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్ల పనితీరు మెరుగుపరచేలా సీడీపీఓలు రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం టీచర్లు, సూపర్‌వైజర్ల పనితీరును తానే పరిశీలిస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సీడీపీఓలు అలేఖ్య, పుష్ప తదితర అధికారులు పాల్గొన్నారు.

చెస్ పోటీలో జిల్లా స్థాయికి ఎంపికైన వేదశ్రీ

మునగాల : కోదాడలోని బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించిన సీఎం కప్ చెస్ విభాగంలో నియోజకవర్గస్థాయి నుండి జిల్లా స్థాయి పోటీలకు మునగాలలోని ట్రినిటీ స్కూలులో ఐదవ తరగతి చదువుతున్న బంగారపు వేదశ్రీ ఎంపికైంది. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనందుకు ఎంపీడీవో దీన్ దయాల్ రమేష్, ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, పిడి ఎస్.కె అన్జామ్, ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపాల్ జాకబ్ రాజు, కరస్పాండెంట్ వనజ, ఉపాధ్యాయులు బృందం ఆమెను అభినందించారు.

సీసీ కెమెరాల నిఘాతో నేరస్తులను సులువుగా పట్టుకోవచ్చు

- పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన నిందితుడు అరెస్ట్
- మీడియా సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం

చేర్యాల ఫిబ్రవరి 05 (జనంసాక్షి) : సీసీ కెమెరాల నిఘాతో నేరస్తులను సులువుగా పట్టుకోవచ్చని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. గురువారం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని చుంచనకోట గ్రామనికి చెందిన మంద గాలమ్మ అనే వృద్ధురాలు ఈనెల 4న తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడు అపహరించాడని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన చేర్యాల పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో 10 గంటల వ్యవధిలోనే కేసును చేదించి చేర్యాల పట్టణానికి చెందిన వంశీ అనే నిందితున్ని అరెస్టు చేసి విచారించి అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ సదానందం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బంగారం ధరలు పెరగడంతో గొలుసు దొంగతనాలు పెరిగే అవకాశం ఉందని, మహిళలు, వృద్ధులు ఒంటరిగా ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు తక్కువ ఉండటం వల్ల ఇలాంటి దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్ గా మారుతుందన్నారు. గ్రామస్తులు స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు వచ్చి గ్రామ ప్రధాన చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిందితునితో త్వరగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ అభినందించారు.

సెప్టిక్ ట్యాంక్ ఆక్రమణలను తొలగించిన హైడ్రా

4 ఎకరాల ప్రభుత్వ స్థలానికి హైడ్రా ఫెన్సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 05 (జనం సాక్షి): సెప్టిక్ ట్యాంకులను కూడా కబ్జాదారులు వదలడం లేదు. సెప్టిక్ ట్యాంకు చుట్టూ మొక్కలను పెంచి ఆ దుర్వాసనను దూరం చేద్దామని ఉద్దేశించిన ఖాళీ స్థలాలను కూడా ఆక్రమించేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఆయా స్థలాలను పార్కులకోసం వినియోగించడం పరిపాటి. ఆ లే ఔట్ వేసిన వారికి కాని, అప్పట్లో లే ఔట్ కోసం భూమిని అమ్మిన వారికి ఆ స్థలాల మీద ఎలాంటి హక్కు లేకున్నా.. వాటిని తర్వాత తమ సొంత స్థలాలుగా ఆక్రమించుకుని ప్లాట్లుగా మార్చుతున్న ఉదంతాలు నగరంలో పలు చోట్ల పరిపాటిగా మారింది. కూకట్‌పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ చేరువలోని శిల్పా బృందావన్ కాలనీలోనూ అదే జరిగింది. ఈ లే ఔట్‌లోని సెప్టిక్ ట్యాంక్ తోపాటు ఆ పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని వైవీ రావు అనే వ్యక్తి కబ్జా చేసేస్తున్నారని అక్కడి నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అంతే కాదు.. తమ లే ఔట్‌కు ఆనుకుని రైతుకు చెందిన భూమిగా కొంత చూపుతూ.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో అనుమతి లేని లే ఔట్‌తో ప్లాట్లు వేయడం, రహదారులు నిర్మించేందుకు హద్దులు నిర్ధారించడం.. తమ లే ఔట్ హద్దులను కూడా చెరిపేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సెప్టిక్ ట్యాంకు ప్రాంతంలో 20 గుంటల మేర ఆక్రమ ణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. అలాగే అనుమతి లేని లే ఔట్ చుట్టూ గురువారం ఫెన్సింగ్ వేసింది. ఈ లే ఔట్‌లో ప్లాట్లు కొని సామాన్యులు మోస పోకుండా.. సెప్టిక్ ట్యాంక్, ఓపెన్ ప్లేస్‌తో పాటు.. ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న దాదాపు 4 ఎకరాలను కాపాడింది. ఫిర్యాదు చేసిన వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. ప్రభుత్వ భూమితో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా కాపాడడం పట్ల శిల్పా బృందావన్ కాలనీ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

'టీచర్' అన్నందుకు చితకబాదుడు

గొంతు నొక్కి విద్యార్థిపై ప్రధానోపాధ్యాయుడు దాడి

మర్రిగూడ, ఫిబ్రవరి 05 (జనంసాక్షి): మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలిని 'టీచర్' అని పిలిచినందుకు ఎనిమిదో తరగతి విద్యార్థిపై ప్రధానోపాధ్యాయుడు తీవ్రంగా దాడి చేసిన ఘటన తీవ్ర సంచలనం రేకెత్తించింది. 'మేడం' అని పిలవాలని హుకుం జారీ చేసిన హెడ్‌మాస్టర్ ఆగ్రహంతో ఊగిపోయి బాలుడి తలను చెట్టుకు బలంగా కొట్టి, గొంతు నొక్కి చితకబాదాడు.

బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డ్రిల్ పీరియడ్ కావడంతో విద్యార్థులు గ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. అప్పుడు హెడ్‌మాస్టర్ హడావిడిగా వచ్చి మహిళా ఉపాధ్యాయురాలిని 'టీచర్' అని పిలిచి మధ్యాహ్నం అటెండెన్స్ ఇప్పటివరకు ఎందుకు తీసుకోలేదని, వెంటనే తీసుకోమని ఆదేశించాడు. ఆమె గ్రౌండ్‌లోనే అటెండెన్స్ తీసుకుంటుండగా ఆ విద్యార్థి కూడా 'టీచర్' అని పిలవడంతో హెడ్‌మాస్టర్ ఆగ్రహం పెల్లుబికాడు.

'మేడం అని పిలవాలి' అంటూ బాలుడిని అక్కడే ఉన్న చెట్టుకు తోసి తలను బలంగా కొట్టాడు. ఆగకుండా గొంతు నొక్కి పదేపదే 'మేడం అని పిలవు' అని బెదిరించి చితకబాదాడు. తల వెనుక భాగం చెట్టుకు గట్టిగా తగలడంతో బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రాత్రి మొత్తం వాంతులు చేసుకున్నాడు.

ఉదయం ధైర్యం కూడగట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన బాలుడు తనపై జరిగిన దాడిని పోలీసులకు వివరించి ఫిర్యాదు చేశాడు. అసలు నిరుపేద కుటుంబానికి చెందిన ఈ బాలుడి తండ్రి చనిపోయాడు. గ్రామ భారతి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

విద్య, వైద్యంతోపాటు మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యం

- 23వ వార్డు అభివృద్ధి ప్రణాళిక విడుదల
- గతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మినీ స్టేడియం ఆధునికీకరణ : పరిమళ రవీందర్
- నిరుపేదలకు ఉచిత పుస్తకాలు, మందులు, మెడికల్ క్యాంపులు
- ఆడపిల్ల పుట్టినా రూ.2,500.. కట్నంగా రూ.11 వేలు సహాయం

తాండూరు ఫిబ్రవరి 5(జనంసాక్షి) : 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గడ్డల పరిమళ రవీందర్ విద్య, వైద్యంతోపాటు మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం వార్డు అభివృద్ధి ప్రణాళికను విడుదల చేశారు. వాల్మీకి నగర్ వార్డుగా నామకరణం చేయించడంలో కీలక పాత్ర పోషించినట్లు పరిమళ రవీందర్ తెలిపారు. 2007లో డాక్టర్ పి. మహేందర్ రెడ్డి సహకారంతో రూ.1.50 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, మున్సిపల్ వాటర్ పైప్‌లైన్‌లో 70 శాతం పనులు పూర్తి చేయించినట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శివాజీ చౌక్ నుంచి విజయ విద్యాలయం వరకు సీసీ రోడ్డు, రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పూర్తి చేయించారు. శిథిలావస్థలో ఉన్న మినీ స్టేడియాన్ని రూ.15 లక్షలతో ఆధునికీకరించారు. నీటి ఎద్దడి నివారణకు 10 బోర్లు, మోటార్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు.

గొల్లచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి రోడ్డు, బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్, విద్యుదీకరణ, మురుగు కాలువ పనులు పూర్తి చేశారు. రజకులకు దోభీ ఘాట్ నిర్మాణం, ప్రహరీ గోడ, బోరు, మోటార్లతో రూ.15 లక్షలతో అభివృద్ధి చేయించారు. వార్డులో 350 వృద్ధాప్య పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయించారు. నిరుపేదల మరణాలకు ఆర్థిక సహాయం అందించారు.

2018-2023 మధ్య బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహకారంతో రూ.1 కోటి నిధులతో సల్లా గార్డెన్, చేరువెంకటేశ్వర గుడి ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు అభివృద్ధి చేయించారు. భవిష్యత్తులో వార్డులో విద్య, వైద్యం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తానని పరిమళ రవీందర్ హామీ ఇచ్చారు. నిరుపేదలకు సంవత్సరానికి ఉచిత పుస్తకాలు, నోటు బుక్కులు, నెలవారీ మందులు అందిస్తాను. మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తాను. ఆడపిల్ల పుట్టిన కుటుంబానికి రూ.2,500, కట్నంగా రూ.11 వేలు, మరణించిన నిరుపేద కుటుంబానికి రూ.5 వేలు సహాయం చేస్తాను. ఆర్ఓ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసి 20 లీటర్ల క్యాన్‌ను రూ.5కే అందిస్తాను. గొల్లచెరువు అభివృద్ధి, ద్వారకా భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, వర్షాకాలంలో దోమల నివారణ, మురుగు నీరు నిలువని విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రాజేంద్రనగర్‌లో భూ వివాదం.. ప్రహరి గోడను కూల్చిన దుండగులు

రాజేంద్రనగర్ : భూ వివాదం పోలీసులకు ఫిర్యాదుచేసే వరకు వెళ్లింది. సన్ సిటీ దగ్గర ఓ ప్రైవేట్ స్థలంలో నిర్మించిన ప్రహరి గోడను దుండగులు జేసీబీతో కూల్చివేశారు. దౌర్జన్యంగా ప్రైవేట్ స్థలంలోకి ప్రవేశించిన 100 మంది హంగామా చేశారు. స్థల యజమాని కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దాంతో భూ యజమాని రవి యాదవ్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా 1935వ సంవత్సరంలో రవి యాదవ్ కుటుంబీకులు హైదర్షాకోట్ సర్వే నెంబర్ 16, 17, 18, 19 లో ఉన్న 39.24 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అందులో 39 ఎకరాల వ్యవసాయ పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ 39 ఎకరాల్లో 21 ఎకరాల పొలాన్ని 1971వ సంవత్సరంలో ఇండియన్ ఆర్మీకి ఇచ్చారు. అయితే సర్వే నెంబర్ 18/4 లో ఉన్న 33 గుంటల స్థలం వివాదంలో ఉంది. కొంతమంది ఆ స్థలం తమదంటూ దౌర్జన్యం చేశారు. ఫేక్ డాక్యుమెంట్‌లు సృష్టించి జేసీబీలతో రెచ్చిపోయారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారులు ఆ ఖరీదైన భూమిపై కన్నేశారు. భూమి తమదని గొడవకు రావడంతో.. యజమాని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ తనపై దౌర్జన్యం చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని భూ యజమాని పోలీసులను కోరారు.

సీఎం తర్వాత సీఎం లాంటోనీ.. తల్లి లేని బిడ్డ ఆదరించండి

తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తర్వాత అంతటోడ్ని వికారాబాద్ అభివృద్ధికి అపారమైన నిధులు సమకూరుస్తానని పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా స్పీకర్ రామయ్య గూడా రాజీవ్ నగర్ కాలనీ రిక్షా కాలనీ ఇందిరానగర్ గరీబ్ నగర్ అంబేద్కర్ కాలనీ కన్య లాల్ బాగ్ లో పర్యటించి తన కూతురు అనన్య తోపాటు అన్ని వార్డులోని కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల కోసం పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చిన్న వయస్సులోనే తన కూతురు అనన్య కౌన్సిలర్ గా పోటీ చేసి చైర్మన్ పదవి చేపట్టనున్న కారణంగా ఆమె పాలకమండలిలో వికారాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తన కూతురు తల్లి లేని బిడ్డని తమ కూతురుగా ఆదరించి కౌన్సిలర్ గా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ అనంతగిరి టూరిజాన్ని 1000 కోట్లతో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ టూరిజం ప్రాజెక్టు వల్ల మహిళలకు అపారమైన ఉద్యోగాలు వస్తాయని అన్నారు. అంతేకాకుండా పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా పట్టణంలోని రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని అన్నారు.

ఉపాధ్యాయుడితో భార్యా అక్రమ సంబంధం.. భర్త ఆత్మహత్యాయత్నం

- హైదరాబాద్ ఆసుపత్రిలో పరిస్థితి విషమం
- గ్రామస్తుల ఆగ్రహం.. ఉపాధ్యాయుడిపై చర్యలు డిమాండ్
- కేసు నమోదు చేసిన పోలీసులు

మర్రిగూడ, ఫిబ్రవరి 5: ప్రభుత్వ ఉపాధ్యాయుడు స్వంత గ్రామానికి చెందిన మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం బయటపడటంతో ఆమె భర్త మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. మర్రిగూడ మండలం వెంకెపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే స్వగ్రామంలోని ఓ మహిళతో ఆయన అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 2వ తేదీ రాత్రి భర్త బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఉపాధ్యాయుడు మహిళ ఇంట్లోకి ప్రవేశించాడు. అనుమానంతో భర్త ఆకస్మికంగా తిరిగి ఇంటికి చేరుకోవడంతో ఇద్దరూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆ రాత్రే భార్యాభర్తల మధ్య తీవ్ర గొడవ జరిగింది. ఈ విషయం గ్రామమంతా వ్యాపించింది. మనస్థాపానికి గురైన భర్త ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే స్పందించి అతన్ని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి ఆదర్శంగా ఉండవలసిన ఉపాధ్యాయుడు ఇలాంటి దారుణానికి పాల్పడటం దురదృష్టకరమని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

మత్తు వదిలి మైదానాలకు తరలాలి

- కాడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి
- కొడంగల్‌లో సీఎం కప్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కొడంగల్, ఫిబ్రవరి 05 (జనం సాక్షి): యువత మత్తుకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా క్రీడల వైపు మళ్లాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కాడ) స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ బాలుర పాఠశాలలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వము రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. యువత మత్తు అలవాట్లకు దూరంగా ఉండాలనే సంకల్పంతోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కొడంగల్ ప్రాంతంలో అద్భుతమైన క్రీడాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అవసరమైన నిధులను కేటాయిస్తూ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు కన్నం మధు, కాలేరు సురేష్, ఎండీఓలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, కార్యదర్శి నర్సింలు, హెడ్‌మాస్టర్లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెంకట్ రెడ్డి క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు జిల్లా క్రీడా యువజన సంక్షేమ అధికారి అబ్దుల్ సత్తార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈరోజు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించగా, రేపు అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి.

న్యాయవాదిని హత్య చేసిన నిందితులను కఠినంగ

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫ్లాగ్ మార్చ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు జీనోమ్ వ్యాలీ ఎస్‌హెచ్‌వో గోపగాని గురువయ్య తెలిపారు. జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, జగద్గిరిగుట్ట పోలీస్ సిబ్బంది కలిసి గ్రామంలో ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు విజిబుల్ పోలీసింగ్, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

పోగొట్టుకున్న బ్యాగ్‌ను దొరకబట్టిన పోలీసులు

- పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన మహిళ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న మహిళ జగద్గిరిగుట్ట పరిధిలోని గాంధీ హైట్స్ వద్ద స్కూటీపై ప్రయాణిస్తున్న సమయంలో ఆమె తన హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్నారు. బ్యాగులో మొబైల్ ఫోన్ ఉండడంతో ఎవరైనా యూపీఐ ద్వారా అకౌంట్‌లోని నగదు విత్ డ్రా చేస్తారేమో అని ఆందోళన చెందారు. ఇదే విషయమై ఆమె జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట క్రైమ్ విభాగం పోలీసులు డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ పి. నరేందర్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తక్కువ సమయంలోనే తన బ్యాగును గుర్తించి, బాధితురాలికి అప్పగించారు. అయితే బ్యాగ్ లోని మొబైల్ ఫోన్ తో సహా.. తన అకౌంట్‌లో నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులన్నీ సురక్షితంగా ఉండటంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో ఉంటే కాంగ్రెస్‌కు ప్రచారమేంటి?

- ఎమెల్యే బండ్ల తీరుపై బిఆర్ఎస్ శ్రేణుల విమర్శలు

గద్వాల, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి బరితెగించారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ వేస్తే.. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ ఫిరాయించలేదని చెప్పుకున్న కృష్ణమోహన్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నాడని స్థానిక బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను కొట్టేయడంతో గద్వాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రచారాన్ని భుజానికి ఎత్తుకుని తిరుగుతున్నారు. మున్సిపాలిటీలో తిరుగుతూ కాంగ్రెస్ కరపత్రాలను ఓటర్లకు పంచుతున్నారు. కాంగ్రెస్ పార్టీకే ఓటేయమని ఓటర్లను అడుగుతున్నారు. నిన్న మొన్నటి వరకు అంటి ముట్టనట్లు ఉన్న బండ్ల ఇవాళ బరితెగించి హస్తం గుర్తు ఉన్న కరపత్రాలను బహిరంగంగా పంచడం చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ ఇప్పుడైనా కళ్ళు తెరిచి ఫిరాయింపు ఎమ్మెల్యేపై బండ్లపై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

పవన్‌తో పొత్తుతో విషం చిమ్ముతున్న బిజెపి

- తెలంగాణ వ్యతిరేకి పవన్ కళ్యాణ్
- కాంగ్రెస్‌కు ఓటేస్తేనే అభివృద్ధి సాధ్యం: పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి5 (జనంసాక్షి): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పొత్తుపెట్టుకుని బీజేపీ తెలంగాణపై విషం చిమ్మడాన్ని ప్రజలెవ్వరూ సహించరని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణను వ్యతిరేకించే విధానాలకు బీజేపీ పాల్పడుతుందని విమర్శించారు. ఒక వైపు తెలంగాణకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. మరోవైపు తెలంగాణ కండ్లు పడి ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండిపోయాయన్న పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను అవమానపరిచే విధంగా, వివక్షపూరితంగా మాట్లాడే వ్యక్తులతో పొత్తులు పెట్టుకుని వస్తున్న బీజేపీ ఆలోచనను తెలంగాణ మేధావులు,ప్రజలు ఆలోచించాలని కోరారు. హుస్నాబాద్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అలాగే గత పదేళ్లలో బిఆర్ఎస్ చేసింది సున్నా అని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు శ్రీసిటీ ఉద్యోగుల మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి5 (జనంసాక్షి) : సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ శ్రీసిటీ ఉద్యోగులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు శ్రీసిటీ ప్రైమరీ ఎలక్ట్రికల్ పరిశ్రమలో పనిచేసే తమిళనాడుకు చెందిన రాజశేఖర్ (33), సూళ్లూరుపేట గాండ్లవీధికి చెందిన గోపిశెట్టి శ్రావణి (31) విధి నిర్వహణ ముగించుకుని మోటారు సైకిల్‌పై వస్తుండగా హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై సూళ్లూరుపేటకు వచ్చేందుకు తిరుగుతుండగా అదేవైపు వస్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో వివాహిత శ్రావణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలై ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రాజశేఖర్‌ను హైవే మొబైల్ వాహనం ద్వారా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తమిళనాడు ఆరణి ధర్మారంకు చెందిన రాజశేఖర్ సూళ్లూరుపేటలోనే అద్దె ఇంట్లో ఉంటూ రోజూ శ్రీసిటీకి వెళ్లేవాడు. సూళ్లూరుపేటకు చెందిన శ్రావణి కూడా అదే పరిశ్రమలో పనిచేస్తుంది. మంగళవారం నైట్ షిఫ్ట్ కావడంతో డ్యూటీకి వెళ్లింది. డ్యూటీ ముగించుకుని రాజశేఖర్‌తో కలిసి మోటారు సైకిల్‌పై వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. మరో 3 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. శ్రావణికి భర్త, ఇద్దరూ ఆడ పిల్లలు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీల్స్ మోజులో బైక్ విన్యాసాలు

- అదుపుతప్పి పడడంతో యువకుడు మృతి

కడప, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : రీల్స్ మోజులో పడి యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన కడపలో చోటు చేసుకుంది. కడపకు చెందిన ముబారక్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. గతరాత్రి అతడు తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై రీల్స్ చేస్తూ దాదాపు మూడు కిలోమీటర్లు వెళ్లాడు. ద్విచక్ర వాహనాన్ని పైకి లేపుతూ విన్యాసాలు చేశారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత వాహనం అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. ఈ ఘటనలో ముబారక్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కడప నగరంలో రీల్స్ మోజులో పడి చాలామంది బైక్‌లపై స్టంట్స్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇప్పటికే మోసపోయాం..మళ్లీమళ్లీ మోసపోవద్దు

- సూర్యాపేట పట్టణంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- రేవంత్ అజ్ఞానంతో చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలి
- బిఆర్ఎస్ నేత, మాజీ జగదీష్‌రెడ్డి పిలుపు

సూర్యాపేట, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : మోసపోతే గోసపడతామని కేసీఆర్ ఎన్నోసార్లు చెప్పిండు. కాంగ్రెస్ మాయగాళ్ళను నమ్మినందుకు నట్టేట ముంచిండ్రు. మరోసారి మోసపోకుండా జాగ్రత్త పడాలి. మున్సిపల్ ఎన్నికల్లో అరాచక కాంగ్రెస్‌ను ఓడించాలి. అభివృద్ధికి కేరాఫ్‌గా ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పట్టంకట్టాలి. సూర్యాపేట మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయం అని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.పుట్టుకతో అజ్ఞానం ఉంటే జ్ఞానం పెరగదని, అందుకు రేవంత్‌రెడ్డే ఉదాహరణ అని జగదీష్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్తే అందరికీ జ్ఞానం పెరుగుతదని, కానీ రేవంత్‌రెడ్డికి ఉన్న జ్ఞానం పోయిందని అన్నారు. సీఎం స్థాయికి తగ్గట్టుగా కాకుండా దిగజారి మాట్లాడుతున్నాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సమస్యల మీద మాట్లాడకుండా బూతులు వ్లలెవేస్తున్నడని, ప్రజలకు ఎం చేస్తాడో చెప్పకుండా అర్థంలేని ఆరోపణలు చేయడం సరికాదని జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన మోసాలను కప్పిపుచ్చేలా రేవంత్ రోత మాటలు మాట్లాడుతున్నారని, గాంధీలా ఆమరణదీక్ష చేసి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను స్వాతంత్యం తెచ్చిన గాంధీతో పోలుస్తూ తెలంగాణ ప్రజలు జాతిపిత అంటున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డికి గతంలో చంద్రబాబు, ఇప్పుడు సోనియా జాతిపితలని, భవిష్యత్తులో మోడీ కూడా జాతిపిత అవుతారేమోనని ఎద్దేవా చేశారు.'రేవంత్ అజ్ఞానంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడు. నల్గొండ జిల్లా పర్యటనలో నిబంధనలకు వ్యతిరేకంగా రేవంత్ శంకుస్థాపనలు చేశాడు. సీఎం జిల్లాకు వస్తే ఏదో ప్రకటిస్తారని ప్రజలు ఆశిస్తారు. కానీ స్థాయి పెరిగినా అవే బూతులు. అర్థంలేని ఆరోపణలు. సీఎం గా రెండేళ్లు గడిచినా రోజురోజుకు సంస్కారహీనత పెరిగిపోతుంది. ఉన్న సమస్యలను పక్కనపెట్టి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నడు. కాంగ్రెస్ సభల్లో ఆయన రోత మాటలతో బిఆర్ఎస్ కు మరింత బలం పెరుగుతున్నది. కాంగ్రెస్ ది బాగుచేసే పనికాదు చెడగొట్టే పనే' అని జగదీష్‌రెడ్డి విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని ఆగం చేస్తున్నరు. అభివృద్ధితోపాటు పదేండ్లలో పెంచిన పచ్చదనాన్ని ఎండబెడుతున్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయిండ్రని అన్నారు.

గాంధీనగర్ విమెన్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

- సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- ఉదయం అంతా బయటకు వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో గల ఓ ఉమెన్స్ హాస్టల్లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై స్థానికులు అగ్నిమాపక అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తూ ప్రమాద సమయంలో ఆ వసతి గృహంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లోని సుధామ పీజీ అకామడేషన్ ఫర్ ఉమెన్స్ హాస్టల్లో అగ్నిప్రమాదం జరిగింది. హాస్టల్‌లో ఉన్న యువతులంతా.. విధులు, కాలేజీలకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాత్రి సమయంలో లేదా విద్యార్థులున్న సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి ఉండవచ్చని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజిన్లు.. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్ని స్తున్నాయి. అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొని మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. నగరంలోని పీజీ హాస్టళ్లలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండటానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. పాత పీజీ హాస్టళ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయించాలని అన్నారు. ప్రతి అంతస్తులో ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఎలా స్పందించాలో హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందనే దానిపై అధికారులు అంచనా వేస్తున్నారు.

బిజెపిని గెలిపిస్తే దండిగా నిధులు

ప్రచారంలో హామీలు గుప్పించిన బండి

కరీంనగర్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) : మున్సిపాలిటీల్లో బిజెపిని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.

దడ పుట్టిస్తున్న పులి సంచారం

- ఆవుదూడలపై దాడిలో మూడు మృతి
- పులిని బంధించేందుకు మాటువేసిన అధికారులు

రాజమండ్రి, ఫిబ్రవరి5 (జనంసాక్షి) : రాజమండ్రి సమీప గ్రామాల్లో పెద్దపులి హడలెత్తిస్తోంది. రోజుకో ప్రాంతం తిరుగుతూ స్థానికులను వణికిస్తోంది. తాజాగా.. రాజనగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామంలో తెల్లవారు జామున పెద్ద పులి ఆవుపై దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో గ్రామస్థుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పంతం సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఆవుపై గురువారం తెల్లవారుజామున పెద్దపులి దాడి చేసింది. ఈ పులి.. నామవరం అక్కమ్మతల్లి కొండప్రాంతం నుంచి దిశ మార్చుకుని పుణ్యక్షేత్రం వైపు వచ్చింది. బుధవారం రాత్రి నామవరం వద్ద బైక్‌పై వెళ్తున్న వారికి కనిపించి, ఆ తర్వాత ఆయిల్ పామ్ తోటల్లోకి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. తాజాగా ఆవుదూడలపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. ఈ ఘటనలో ఒక ఆవుతో పాటు మూడు ఆవు దూడలూ మృతిచెందాయి. జీ.ఎర్రంపాలెంలో ఆవు దూడలు మృతిచెందిన ప్రాంతం వద్ద పులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులు గాలిస్తున్నారు. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అటవీ సిబ్బంది సహా మత్తు వైద్యులు, పోలీసులు చేరుకున్నారు. ప్రత్యేక బృందం పులికి మత్తుమందు ఇచ్చేందుకు గన్‌లు సిద్ధం చేసుకున్నారు. రాజమండ్రి సమీపంలోని పుణ్యక్షేత్రం గ్రామంలో పెద్ద పులి సంచారం భయందోళనలు సృష్టిస్తోంది. ఇప్పటికే పెద్ద పులిని బంధించేందుకు ఢిల్లీలోని నేషనల్ టైగర్ అథారిటీతో సహా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అటవీశాఖ అధికారులు అనుమతులు తీసుకున్నారు. పులిని బంధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పెద్ద పులి సంచారం నేపథ్యంలో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. ప్రజలు రాత్రి బయటకు రాకూడదని అటవీశాఖ అధికారులు సూచించారు. పొలాలకు వెళ్లే సమయంలో ఒంటరిగా వెళ్లవద్దని తెలిపారు. పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖకు సమాచారం అందించాలని సూచించారు. అటవీశాఖ, స్థానిక పోలీసులు గస్తీ పెంచుతూ, గ్రామంలో భద్రతా చర్యలు కొనసాగిస్తున్నారు.

గజ్వేల్ ఘనత చాటుదాం

- మళ్లీ బిఆర్ఎస్‌నే గెలిపిద్దాం
- మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు పిలుపు

సిద్దిపేట, ఫిబ్రవరి5 (జనంసాక్షి) : కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రదాత అని గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని ఆ పార్టీ నేత, సిద్దిపేట ఎమెల్యే హరీష్‌రావు అన్నారు. చెప్పారు. 'కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుందన్నది ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగట్టారు. 'గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చాయి. మనకు అన్నం పెట్టిన వాళ్లకు, మనకు పని చేసిన వాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్న వాళ్లకే ఓటేయాలి. సద్దితిన్న రేవు తలవాలి' అని చెప్పారు. ప్రజ్ఞాపూర్-గజ్వేల్ రోడ్డు అప్పుడు ఎట్లుండే..? ఆ రోజు గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా ఉండేది. ఈ రోజు 250 పడకల ఆసుపత్రి తెచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించింది కేసీఆర్. గజ్వేల్‌కు ఆర్డీవో ఆఫీస్, రైలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ చేసింది కేసీఆర్ కాదా..? కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కేసీఆర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు 13,000 అందించిన ఘనత కేసీఆర్‌ది' అన్నారు. 'మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ బిడ్డల కోసం గురుకులాలు స్థాపించి చదువుల విప్లవం తెచ్చింది కేసీఆర్. ఒకప్పుడు గజ్వేల్‌లో మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి పోయి.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారు. బిందెలు పట్టే కష్టం లేకుండా చేసి, మహిళల కష్టాలు తీర్చింది కేసీఆర్. రైతుబంధు ఎందుకు వేయలేదు అంటే ఎలక్షన్ అయ్యాక ఇస్తా అంటున్నాడు రేవంత్. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ 11 సార్లు రైతుబంధు ఆపలేదు. ఇంటింటికీ బియ్యం, మందులు పంపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటికీ రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండు. ఇది మూడోది. ఎగ్గొట్టిన రెండు, ఇప్పుడు రావాల్సిన ఒకటి కలిపి మూడు రైతుబంధులు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావాలంటే మాకు అభ్యంతరం లేదని ఎలక్షన్ కమిషన్‌కు మేమే లేఖ ఇస్తాం. 11వ తేదీలోగా రైతుబంధు వేయకపోతే రైతులు నిన్ను చీల్చి చెండాడుతారు' అని హరీష్‌రావు హెచ్చరించారు. ' మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నాడు. ఎవరికైనా వచ్చిందా..? ఫ్రీ బస్సు అని మగోళ్లకు డబుల్ టికెట్ కొట్టి, ఆడవాళ్లకు తిప్పలు పెట్టారు. పువ్వు గుర్తు వాళ్ళు ఎన్నడైనా ఒక్క రూపాయి పని చేశారా..? అక్షింతలు పంచడం తప్ప ఏమైనా చేశారా..? యాదాద్రి నరసింహ స్వామి గుడి కట్టింది కేసీఆర్. గజ్వేల్ వెంకటేశ్వర స్వామి గుడి, రామాలయం, శివాలయం అద్భుతంగా కట్టించింది కేసీఆర్. పనిచేసే వాళ్లకు ఓటేద్దామా..? అక్షింతలు వేసే వాళ్లకు ఓటేద్దామా..? కేసీఆర్ ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆలోచించి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారు. షాదీ ముబారక్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక మైనార్టీల కోసం ఒక్క రూపాయి పనిచేశారా..? ఎరువు బస్తాలు ఇచ్చే తెలివి లేదు. చేతగాని దద్దమ్మ రేవంత్ రెడ్డి' అని హరీష్‌రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డీ నువ్వు కేసీఆర్‌ని తిడతావా..? నీ మొఖానికి పండిన వడ్లు కొనే తెలివిలేదు. దళితబంధు బంద్ పెట్టి రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నావు. మన తెలంగాణను కాపాడు కోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేయాలి. ఇప్పుడు గెలిచిన కౌన్సిలర్లు ఐదేళ్లు ఉంటారు. రెండేళ్లలో వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమే. ప్రజ్ఞాపూర్ గౌరవం నిలబడాలంటే బీఆర్ఎస్ గెలవాలి' అని చెప్పారు. వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370